# మహానది

MAHANADI TELUGU DAILY


Website: www.mahanadi.net

RNI No. TELTEL . 12/48343

రంగారెడ్డి | సంపుటి : 4 | సంచిక : 261 | | ఎడిటర్ : మామిడి సోమయ్య | శనివారం | డిసెంబర్ | 13 | 2025 పేజీలు : 8 | వెల : రూ.2.00


## రూ.1,404 కోట్ల అవినీతి, మాజీ బ్యాంకు అధికారిని ఉరి తీసిన చైనా

బీజింగ్: రూ.1,404 కోట్ల అవినీతి , లంచం తీసుకున్న నేరాలకు సంబంధించిన కేసుచైనా సంచలన నిర్ణయం తీసుకుంది. దోషిగా తేలిని సీనియర్ బ్యాంకర్‌ను ఉరి శిక్షను అమలు చేసింది. సుప్రీం పీపుల్స్ కోర్టు మునుపటి తీర్పును సమర్థించిన తర్వాత టియాంజిన్‌లో మరణశిక్ష అమలు చేసినట్లు అధికారులు ధృవీకరించారు. బాయి టియాన్‌హుయ్ వేలకోట్ల అక్రమాలు, దేశంలోని ప్రధాన బ్యాంకుల్లో ఒకటి పాపులర్ ఈ కేసు చైనాలో , అంతర్జాతీయంగా దృష్టిని ఆకర్షించింది. చైనా హువారోంగ్ఇంటర్నేషనల్ హెూల్డింగ్స్‌లోమరియురాష్ట్ర-సంబంధిత సంస్థలలోఅవినీతికి వ్యతిరేకంగా బీజింగ్ కొనసాగుతున్న ప్రచారంలో భాగంగా ఈ శిక్షను అమలు చేసింది.చైనా బిలియన్ యువాన్ల లంచం తీసుకున్నందుకు దోషిగా తేలిన తర్వాత 2021లో ఉరితీశారు. సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్‌రిపోర్ట్ ప్రకారం సుప్రీం పీపుల్స్ కోర్టు మునుపటి తీర్పును సమర్థించిన నేపథ్యంలో టియాంజిన్‌లో బాయి టియాన్‌హుయ్ మరణశిక్ష అమలు చేసినట్టు అధికారులు నిర్ధారించారు.



### కేంద్ర మాజీ మంత్రి శివరాజ్ పాటిల్

# కన్నుమూత

- మహారాష్ట్రలోని లాతూర్‌లో 90 ఏళ్ల వయసులో మృతి
- కేంద్ర హెూం మంత్రిగా, లోక్‌సభ స్పీకర్‌గా కీలక బాధ్యతల నిర్వహణ
- 26/11 ముంబై దాడుల తర్వాత నైతిక బాధ్యతతో మంత్రి పదవికి రాజీనామా
- ఏడుసార్లు లాతూర్ నుంచి లోక్‌సభకు ఎన్నికైన అనుభవజ్ఞుడు

ఢిల్లీ,:కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి, లోక్‌సభ మాజీ స్పీకర్ శివరాజ్ పాటిల్ (90) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, మహారాష్ట్రలోని లాతూర్‌లో శుక్రవారం తుదిశ్వాస విడిచారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో కీలక పదవులను అలంకరించిన శివరాజ్ పాటిల్, దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. శివరాజ్ పాటిల్ రాజకీయ ప్రస్థానం: 1972లో లాతూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన శివరాజ్ పాటిల్, రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా కూడా పనిచేశారు. 1980లో తొలిసారి లాతూర్ నుంచి లోక్‌సభకు ఎన్నికై జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించారు. అప్పటి నుంచి 1999 వరకు వరుసగా ఏడుసార్లు అదే స్థానం నుంచి ఎంపీగా గెలుపొంది రికార్డు సృష్టించారు. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ ప్రభుత్వాల్లో రక్షణ, వాణిజ్యం, శాస్త్ర సాంకేతికత, పౌర విమానయానం వంటి పలు కీలక శాఖలకు మంత్రిగా సేవలందించారు. 1991 నుంచి 1996 వరకు లోక్‌సభ స్పీకర్‌గా ఆయన బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన హయాంలోనే పార్లమెంట్ లైబ్రరీ భవన నిర్మాణం, లోక్‌సభ కార్యకలాపాల ప్రత్యక్ష ప్రసారం వంటి ముఖ్యమైన సంస్కరణలు జరిగాయి. 2004లో యూపీఏ ప్రభుత్వంలో కేంద్ర హెూం మంత్రిగా బాధ్యతలు చేపట్టిన శివరాజ్ పాటిల్, 2008లో ముంబైలో జరిగిన 26/11 ఉగ్రదాడులకు నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత 2010 నుంచి 2015 వరకు పంజాబ్ గవర్నర్‌గా, చండీగఢ్ అడ్మినిస్ట్రేటర్‌గా కూడా ఆయన సేవలందించారు.




### మద్రాస్ హైకోర్టులో ఏదో తప్పు

# జరుగుతోంది

### సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు

ఢిల్లీ,: మద్రాస్ హైకోర్టులో కేసుల లిస్టింగ్, విచారణకు సంబంధించి అనుసరిస్తున్న నిబంధనలపై సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. "అక్కడ ఏదో తప్పు జరుగుతోంది" అని వ్యాఖ్యానిస్తూ, దీనిపై పూర్తి వివరణ ఇవ్వాలని హైకోర్టును ఆదేశించింది. ఈ కేసులో మద్రాస్ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను ప్రతివాదిగా చేర్చి నోటీసులు జారీ చేసింది. నటుడు విజయ్ స్థాపించిన 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీకి సంబంధించిన కరూర్ తొక్కిసలాట కేసు విచారణ సందర్భంగా జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. కరూర్ ఘటనపై మద్రాస్ హైకోర్టులోని రెండు వేర్వేరు బెంచ్‌లు పరస్పర విరుద్ధమైన తీర్పులు ఇవ్వడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఈ ఘటనపై సీబీఐ విచారణను మధురై బెంచ్ తిరస్కరించగా, కేవలం రోడ్‌షోలకు మార్గదర్శకాలు కోరుతూ దాఖలైన పిటిషన్‌పై చెన్నై బెంచ్ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో విచారణకు ఆదేశించడాన్ని అనుచితమని గతంలోనే సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. విచారణ సందర్భంగా జస్టిస్ జేకే మహేశ్వరి మాట్లాడుతూ, "హైకోర్టులో ఏదో తప్పు జరుగుతోంది. వేం దీన్ని పరిశీలించాల్సి ఉంది" అని వ్యాఖ్యానించారు. తమిళనాడు ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ఎన్.కె. కౌల్ వాదనలు వినిపిస్తూ.. ఈ ఘటనపై తాము ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్‌పై స్టేను ఎత్తివేయాలని కోరారు. అయితే, ముందుగా హైకోర్టు పనితీరుకు సంబంధించిన అంశాన్ని తేలుస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.



### ఢిల్లీలో గాలి నాణ్యతలు

# 'వెరీ పూర్'

న్యూఢిల్లీ : ఢిల్లీలో శుక్రవారం గాలి నాణ్యతలు వెరీపూర్ కేటగిరిలో నమోదయ్యాయి. గత రెండుల్లో కొంత మెరుగుపడి పూర్ కేటగిరిలో నమోదయ్యాయి. మరలా శుక్రవారం క్షీణించి 'వెరీ పూర్' కేటగిరిలో నమోదయ్యాయి. ఈరోజు ఉదయం ఢిల్లీలో 7 గంటల సమయానికి ఎక్యూఐ స్థాయిలు 329 వద్ద నమోదయ్యాయి. ఈ స్థాయిల్ని 'వెరీ పూర్' కేటగిరిలో వర్గీకరిం చినట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది.కాగా, శుక్రవారం తెల్లవారు జామున ఆనంద్ విహార్, ఘాజిపూర్ ప్రాంతాల్లో దట్టమైన పొగ మంచు కమ్మేసింది. ఆ ప్రాంతాల్లో ఎక్యూఐ 386గా నమోదైంది. సోనియా విహార్ 338, వజీర్పూ ర్ 382 ఎక్యూఐ స్థాయిలు నమోదైనట్లు సిపిసిబి పేర్కొంది.

హైదరాబాద్,: తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025ను విజయవంతంగా నిర్వహించడంపై ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభినందించారు. ఈ సమ్మిట్ చారిత్రాత్మక విజయమని పేర్కొంటూ ఆయన ముఖ్యమంత్రికి ఒక లేఖ రాశారు. డీప్‌టెక్, గ్రీన్‌ఎనర్జీ, లైఫ్ సైన్సెస్ వంటి కీలక రంగాల్లో భారీగా పెట్టుబడులు రావడం శుభపరిణామమని ఆయన పేర్కొన్నారు. రూ.లక్షల కోట్ల పెట్టుబడులు రావడం సీఎం రేవంత్ పాలన, రాష్ట్రంలో నెలకొన్న స్థిరత్వం, భవిష్యత్తుపై పెట్టుబడిదారులకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమని డాక్టర్ నోరి తన లేఖలో కొనియాడారు. ఈ పెట్టుబడులు 'తెలంగాణ రైజింగ్–2047' విజన్‌కు అద్దం పడుతున్నాయని, ప్రపంచ వేదికపై తెలంగాణ సత్తా చాటడానికి ఇది దోహదపడుతుందని వివరించారు. రాష్ట్రంలో ఆరోగ్య సంరక్షణ, ప్రజల జీవన ప్రమాణాల పెంపు కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఆయన ప్రశంసించారు. ఈ పెట్టుబడులు ప్రజారోగ్య రంగంలో మౌలిక సదుపాయాల కల్పనకు ఎంతగానో ఉపయోగపడతాయని, క్యాన్సర్ చికిత్సలో తెలంగాణ గ్లోబల్ లీడర్‌గా ఎదిగేందుకు అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు.



### సీఎం రేవంత్ రెడ్డిని అభినందిస్తూ

## డాక్టర్ నోరి దత్తాత్రేయుడు లేఖ

- తెలంగాణ రైజింగ్ విజన్ అద్భుతమన్న డాక్టర్ నోరి
- లక్షల కోట్ల పెట్టుబడులు రావడం చారిత్రాత్మక విజయమని ప్రశంస
- రేవంత్ పాలన, స్థిరత్వంపై విశ్వాసానికి ఇది నిదర్శనమని వ్యాఖ్య



### సక్రమంగా పనిచేయని అధికారులను

# వెంటనే తీసి పడేయండి

### మంత్రి శ్రీనివాస్ రెడ్డి

ములుగు : ఏ అధికారి ఏ పని చేస్తున్నారో అర్థం కావడం లేదని పనులు సక్రమంగా చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారంటూ మంత్రి శ్రీనివాస్ రెడ్డి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సక్రమంగా పనిచేయని అధికారులను వెంటనే తీసి పడేయండి అంటూ ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం మంత్రులు శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, ముఖ్యమంత్రి పర్సనల్ సెక్రెటరీ శ్రీనివాసరాజులు మేడారం చేరుకోగానే గిరిజన పూజారులు సాంప్రదాయ ప్రకారం మంత్రులను తోడుకొని గద్దెలపై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రులు ఆలయం వద్ద జరుగుతున్న పునరుద్ధ పనులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు.

నూతనంగా ఏర్పాటు చేస్తున్న పాలరాతి శిల్పాలను పరిశీలించి పనులు సకాలంలో పూర్తవుతాయా అనే అనుమానం వ్యక్తం చేశారు. ఇదే సందర్భంలో గద్దెల వెనుక ఐటిడిఏకు భవనం కూల్చివేయడం దానికి సమీపంలోనే ప్రైవేటు వ్యక్తులు గృహ నిర్మాణం చేపట్టడం చూసిన మంత్రి శ్రీనివాస్ రెడ్డి ఆ భవనాలు ఎవరివి అంటూ అధికారులను ప్రశ్నించారు. ఒక దశలో పి ఆర్ ఇ ఈ అజయ్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే సంబంధిత అధికారులందరినీ సమావేశపరచాలని ఆదేశాలు జారీ చేశారు. సకాలంలో పనులు పూర్తవుతాయా అనే అనుమానం వ్యక్తం చేస్తూ 24 గంటల పాటు పనులు చేయాలని, అనుకున్న సమయానికి అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.




## పలుచోట్ల స్వల్ప తేడాతో ఓడిన అభ్యర్థులు

# కాంగ్రెస్ నేతల ఇలాఖాల్లో బీఆర్ఎస్ గెలుపు

హైదరాబాద్, డిసెంబర్12 : వేలం పాటల ఏకగ్రీవాల్లో కాంగ్రెస్ పార్టీ బలంగా కనిపించినా.. ప్రజాక్షేత్రంలో మాత్రం గులాబీ పార్టీ పలుస్థానాల్లో సత్తా చూపింది. హోరాహోరీగా సాగిన తొలి విడత గ్రామ పంచాయితీ ఎన్నికల్లో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు అధికార కాంగ్రెస్ పార్టీకి ముచ్చెమటలు పట్టించారు. గులాబీ సైన్యం పోటీచేసిన ప్రతి పంచాయతీలో పోటీ నువ్వా–నేనా అన్నట్టు సాగింది. సంఖ్యాపరంగా కాంగ్రెస్ పార్టీకి పంచాయితీల సంఖ్య కొద్దిగా మెరుగ్గా ఉన్నట్టు కనిపించినా.. ఆ పార్టీకి గ్రామాల్లో 56శాతం వ్యతిరేక ఓట్లు పడ్డట్టు ఎన్నికల ఫలితాలను బట్టి తెలుస్తున్నది. సూర్యాపేట జిల్లా లింగంపల్లి గ్రామంలో బీఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించారు. మేజర్ గ్రామ పంచాయతీకి బీఆర్ఎస్ బలపరిచిన 95 ఏండ్ల రామచంద్రారెడ్డి తిరుగులేని ఆధిక్యం కనబరిచారు. భద్రాచలం కాంగ్రెస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సొంత గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నేత మడకం జోగయ్య 84 ఓట్ల తేడాతో గెలిచారు. మంత్రి సీతక్క సొంత జిల్లా ములుగు మేజర్ గ్రామ పంచాయతీ ఏటూరునాగారంలో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి కాకులమర్రి శ్రీలత 3,230 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 60 శాతంకాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల స్వగ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు విజయకేతనం ఎగురవేశారు. జడ్చర్ల, భద్రాచలం, షాద్‌నగర్, మహబూబాబాద్, ఇంకా అనేక నియోజవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ సొంత గ్రామాల్లో సర్పంచ్‌లను గెలిపించుకోలేకపోయారు. తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 4,236 గ్రామ పంచాయతీల ఎన్నికలకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో 396 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి.



### కొనసాగుతున్న

# కర్నాటకం

- వేడెక్కుతున్న విందు రాజకీయం
- ఎమ్మెల్యేలతో డికె డిన్నర్ మీటింగ్

బెంగళూరు,డిసెంబర్12 : కర్ణాటక రాజకీయాలు కొన్ని నెలలుగా చర్చనీయాంశమవుతున్నాయి. సిఎం పదవి కోరుకుంటున్న డికె శివకుమార్ ఎత్తులు వేస్తున్నారు. అంతకు మించి అన్నట్లు సిద్దరామయ్య కూడా పావులు కదుపుతున్నారు. దీంతో ఇప్పుడు ఈ ఇద్దరి రాజకీయం హాట్ టాపిక్‌గా మారింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దిల్లీ పర్యటనలు, బ్రేక్‌ఫాస్ట్ మీట్‌లు వార్తల్లో నిలుస్తున్నాయి. ఇప్పుడు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ విందు రాజకీయం చేశారు. గురువారం రాత్రి 30 మందికి పైగా ఎమ్మెల్యేలతో కలిసి శివకుమార్ డిన్నర్ చేశారు. వారిలో కొందరు మంత్రులు కూడా ఉన్నారని, కాంగ్రెస్ నేత ప్రవీణ్ ఫామ్‌హౌస్‌లో ఈ మీటింగ్ జరిగిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. భాజపా నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్యేలు ఎస్‌టీ సోమశేఖర్, శివరామ్ హెబ్బర్ కూడా ఈ డిన్నర్‌కు వచ్చినట్లు పేర్కొన్నాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కొందరు మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి ఒకరోజు ముందు ఇలాంటి డిన్నర్‌లోనే పాల్గొనడం గమనార్హం. వారికి బెళగావి నార్త్ ఎమ్మెల్యే ఫిరోజ్ ఆతిథ్యం ఇచ్చారు. ఇవన్నీ సాధారణ కార్యక్రమాలేనని నేతలు చెబుతున్నారు. ఎమ్మెల్యే ఇంట్లో జరిగిన విందులో పాల్గొన్నాం. అందులో ప్రత్యేకత ఏమీ లేదు. అదొక స్నేహపూర్వక సమావేశం'అని డీకే అన్నారు.

హైదరాబాద్, : తెలంగాణ రాజకీయాల్లో శుక్రవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత.. ఇద్దరు ఎమ్మెల్యేలతో పాటు ఓ మీడియా సంస్థకు లీగల్ నోటీసులు పంపారు. బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వరరెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, టీ న్యూస్ ఛానల్‌కు ఈ నోటీసులు జారీ అయ్యాయి. తనపైనా, తన భర్త అనిల్‌పైనా నిరాధా రమైన ఆరోపణలు చేశారని, వారం రోజుల్లోగా బహిరంగ క్షమాపణ చెప్పాలని కవిత ఆ నోటీసులో డిమాండ్ చేశారు. ప్రస్తుతం కవిత "తెలంగాణ జాగృతి జనం బాట" పేరుతో రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్నారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు చేపట్టిన ఈ యాత్రలో భాగంగా ఆమె వివిధ పార్టీల నేతలపై విమర్శలు చేస్తున్నా రు. మొదట ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పర్యటించిన కవిత, ప్రస్తుతం హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలపై దృష్టి సారించారు. నిన్న మలక్‌పేట, యాకుత్‌పురా, చాంద్రాయ ణగుట్ట నియోజకవర్గాల్లో పర్యటించారు. ఈ క్రమంలోనే కూకట్‌పల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుపై కవిత కొన్ని వ్యాఖ్యలు చేశారు. దీనికి కృష్ణారావు కూడా గట్టిగా బదులిచ్చారు. ఈ మాటల యుద్ధం నేపథ్యంలోనే ఆయనకు కవిత లీగల్ నోటీసులు పంపినట్లు తెలుస్తోంది. ఇదే తరహాలో తనపై ఆరోపణలు చేసిన బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వరరెడ్డి, టీ న్యూస్‌కు కూడా నోటీసులు జారీ చేయడంతో ఈ విషయం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.



### టీన్యూస్, ఇద్దరు ఎమ్మెల్యేలకు

# కవిత నోటీసులు

- మహేశ్వరరెడ్డి, మాధవరం కృష్ణారావులకు నోటీసులు
- తనపై, తన భర్తపై నిరాధార ఆరోపణలు చేశారని మండిపాటు
- వారం రోజుల్లో క్షమాపణలు చెప్పాలని డిమాండ్


# ఓటరా..జర జాగో ఓటు వజ్రాయుధమని గుర్తించుకో



బయ్యారం,మహనది న్యూస్,డిసెంబర్ 12:మండల ప్రజలారా సర్పంచ్ ఎన్నికలు వచ్చాయి..మీ పంచాయితీ పరిధిలో సర్పంచిని ఎన్నుకునే అవకాశం గ్రామ ఓటర్లకి ఉంది-కనుక సర్పంచ్ అభ్యర్థికి ఒక ఓటు వేయాలంటే ఆలోచించి వేయండి. ఎందుకంటే ఆ ఓటు విలువ గ్రామ ఐదేళ్ల పరిపాలన.సర్పంచ్ అంటే గ్రామ పంచాయితీకి ఎన్నికైన అధిపతి, గ్రామానికి ప్రథమ పౌరుడు, స్థానిక స్వయం పాలనలో ముఖ్య పాత్ర వహించే నాయకుడు(రాలు). మీ ఆలోచనే మీ గ్రామం పాలన అభివృద్ధికి ఆనవాళ్లు అవుతాయి. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే మనం వేసే ఓటు అనేది చాలా కీలకపాత్ర వహిస్తుంది.. నాయకులు తలుపు తడతారు. మనల్ని 'అన్న, తమ్ముడు' అంటూ ఆలింగనం చేసుకుంటారు. కానీ ఒక్కసారి గుండె మీద చేయి వేసుకుని ఆలోచించండి.. తరాలు మారుతున్నా సామాన్యుడి తలరాత ఎందుకు మారడం లేదు? నాయకులు మారుతున్నారు, వాళ్ల కార్ల మోడళ్లు మారుతున్నాయి, వాళ్ల బంధువులు రాత్రికి రాత్రే కోటీశ్వరులవుతున్నారు. కానీ, ఏళ్ల తరబడి పార్టీల కోసం, నాయకుల కోసం జెండా మోసిన కార్యకర్త బతుకు మాత్రం అక్కడే మిగిలిపోతోంది. అధికారం వాళ్లది, ఆస్తులు వాళ్లవి.. మరి కష్టం, నష్టం, కేసులు మనవా? మన ఓటు.. వాళ్ల 'అధికార టికెట్' ఎన్నికల్లో గెలిచిన నాయకుడి ఇల్లు కోట లాంటి భవనంగా మారిపోతుంది. ఆయన చుట్టూ ఉన్నవారంతా లక్షాధికారులవుతారు.. ఎందుకంటే మన ఓటు వాళ్లకు కేవలం ఒక 'అధికార టికెట్'. మన నమ్మకం. వాళ్లకు సంపాదన మెట్టు మాత్రమే. రోడ్ల మీద జెండాలు, మైకుల్లో హామీలు, ఇంటింటికీ నమస్తేలు.. కానీ ఐదేళ్లకోసారి మనల్ని గుర్తు చేసుకునేవాళ్లు, మిగతా రోజుల్లో ఎక్కడ ఉంటారు?

**మిగిలేది కర్ర మాత్రమే**

జెండా మోస్తే మిగిలేది 'కర్ర' మాత్రమే.. పదవి వచ్చాక వాళ్లకి మాత్రం 'కాసుల' మోత! కన్నీళ్లు మారట్లేదు! మన కళ్ల ముందే అదుతేలు జరుగుతున్నాయి. ఏళ్ల తరబ డి ఆ పార్టీ కోసం, ఆ నాయ కుడి కోసం గొంతు చించుకు ని అరిచిన కార్యకర్త పరిస్థితి ఏంటి? జెండా మోసిన వాడి భుజం కాయలు కాసింది త ప్ప, జేబు నిండలేదు. బతుకు మారలేదు. చివరికి అధికా రం వాళ్లది, ఆస్తులు వాళ్లవి.. మిగిలే కష్టం, నష్టం, పోలీస్ కేసులు మాత్రం మనవా?




**మన ఓటు**

**వాళ్ళకి రాజమార్గం**

మన ఓటు.. వాళ్లకొక 'అధికార టికెట్' రాజకీయ నాయకులకు మన ఓటు కేవలం ఒక 'పాస్ పోర్ట్' లాంటిది. ఒక్కసారి గెలిచి సభల్లో అడుగుపెట్టడానికి మనల్ని నిచ్చెనలా వాడు కుంటారు. ఆ నిచ్చెన ఎక్కి పైకి వెళ్లాక, ఆ నిచ్చెనను (ఓటరును) తన్ని వెళ్లిపోతారు. ఎందుకంటే మన ఓటు వాళ్లకు పెట్టుబడి మాత్రమే.. ఎన్నికల్లో ఖర్చు పెట్టిన దానికి, గెలిచాక వడ్డీతో సహా వసూలు చేసుకుంటారు. రోడ్ల మీద జెండాలు, మైకుల్లో హామీలు, ఇంటింటికీ నమస్తేలు.. ఇవన్నీ కూడా ఆ పెట్టుబడిలో భాగమే..

**చివరకు మిగిలేది నిరాశే..!**

ముఖ్యంగా యువత మేలుకోవాల్సిన సమయం ఇది. నీ రక్తంలో ఉన్న వేడిని, నీ అమూల్యమైన యవ్వనాన్ని స్వార్థ రాజకీయాలకు బలి చేయకు.. నీ కోసం ఆసుపత్రికి రాని నాయకుడి కోసం నీ పిల్లల ఫీజు కట్టని నాయకుడి కోసం, నువ్వు జెండా పట్టి తిరుగుతావా? నీ సమయాన్ని, జీవితాన్ని నాయకుడికి ధారపోస్తే.. చివరికి మిగిలేది నిరాశే.. వాళ్లు ఎదుగుతారు.. నిన్ను వాడుకుంటారు. నీ జెండా నీ కుటుంబం కావాలి, నీ ఎజెండా నీ అభివృద్ధి కావాలి.

**ఓటర్ గెలిచేదెన్నడు?**

ఓటు వేయడం అంటే ఏదో ఒక నాయకుడిని గెలిపించడం కాదు.. నీ బతుకును నువ్వు గెలిపించుకోవడం! కొన్ని వందల రూపాయలకు, మందు సీసాలకు ఓటు అమ్మేస్తే.. ఐదేళ్లు బానిసగా ఉండక తప్పదు. అదే ఓటును ఆయుధంగా వాడితే, ప్రశ్నించే హక్కు నీకు ఉంటుంది. నీ ఓటు మారితే... వాళ్ల గద్దె దిగొచ్చు, నీ బతుకు ఎదుగొచ్చు! రాజకీయాల్లో నాయకుడు ఎప్పుడూ ఓడిపోలేదు.. ఓటర్ ఎప్పుడూ గెలవలేదు.. ఈ చరిత్రను తిరగరాయాల్సిన బాధ్యత యువతదే.. నీ యవ్వనం నాయకుల కోసం కాదు.. నీ కుటుంబం కోసం అని ఆలోచించు.

**ఓటు ఎవరికి వెయ్యాలి..?**

ఓటు వేసే ముందు ఎవరికి వేస్తే, ఆ ఓటు పూర్తిగా సద్వినియోగం ఔతుందో తెలుసుకుని మరీ ఓటు వేయాలి. సమాజాభివృద్ధికి ఏ అభ్యర్థి సేవ చేస్తారోనన్న అవగాహనతో ఆలోచించి ఓటేయాలి. ఈ విషయంలో ఏ పార్టీకి చెందని మేధావులు అలోచించి సామాన్య ఓటర్లను గైడ్ చెయ్యాలి. ఇపుడు అనాలోచితంగా.. ఎవరికి తోస్తే వారికి గుడ్డిగా నమ్మి ఓటేస్తే..ఆ పై ఐదేళ్లూ మనమందరం భాదపడాల్సి వస్తుంది. ఇది ప్రజాస్వామిక వ్యవస్థ. ఇక్కడ ప్రజలు స్వఛరేదంగా ఎన్నుకున్న నాయకులే పరిపాలన చేయాలి.




ఎన్నికైన నాయకులు అవినీతికి దూరంగా, బంధు ప్రీతికి అతీతంగా.. రాజ్యాంగ బద్దంగా, అమలులో ఉన్న చట్టాలకు లోబడి మాత్రమే పరిపాలన చేయాలి. అలా పరి పాలన చేస్తారని మనకు నమ్మకం కుదురుతేనే ఆ నాయకుడికి మనం ఓటువేయాలి. ప్రజా జీవితంలో ఉండే వారికి నిరంకుశ ధోరణి పనికి రాదు. అలా డిక్టేటర్ లా ఆలోచించే వారిని ఎన్నుకుంటే ఇక రాబోయే ఐదేళ్లు మనకు బాధలు తప్పవు. సోంబేరులకు ఓటు వేస్తే కూడా పరిపాలన మొత్తం అధోగతి పాలౌతుందని తెలుసుకోండి.

మంచివారిని ఎన్నుకుంటే మంచిపాలన అందిస్తారు. బాగా ఆలోచించండి.. డబ్బుకి మీ ఓటును అమ్ముకోవద్దు. సారాయి పోయించిన వారికి ఓటు వెయ్యవద్దు. మన కులపోడని, మన మతపోడని చూసుకుని ఓటు వెయ్యవద్దు. కులం, మతం మన కడుపులు నింపవు. కాబట్టి కుల మతాలకు అతీతంగా ఆలోచించి ఓటువెయ్యాలి. అలామీ ఓటును సక్రమంగాఆలోచించి వేయకపోతే ..రేపు మీరు వారిని నిలదీసే హక్కును కోల్పోతారు. ఎవరు నిజాయతీగా పాలన చేస్తారని అనుకుంటారో వారికి మాత్రమే వెయ్యండి. అలావేసినపుడే, గెలిచిన వారు రేపు సరిగా చెయ్యకపోతే, మన ఓట్లతో గెలిచిన వ్యక్తులను మనమే నిలదియ్య వచ్చు. అందుకే ఓటువేసే ముందే ఆలోచించండి, ఆలోచించి మరీ ఓటు వేయ్యండి. అనాలోచితంగా ఓటెయ్యకండి.

## జర్నలిస్టుల సమస్యలపై.. కలెక్టర్ కు టీడబ్ల్యూజేఎఫ్ వినతి

### -వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించండి

### -టిడబ్ల్యూజేఎఫ్ మేడ్చల్ జిల్లా నూతన కమిటీ విజ్ఞప్తి



మేడ్చల్/ కుత్బుల్లాపూర్,మహానది న్యూస్,డిసెంబర్ 12: మేడ్చల్ జిల్లా పరిధిలో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలపై తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా నూతన కమిటీ శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ను కలిసి కలెక్టర్ కు ఇవ్వాల్సిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా టీడబ్ల్యూజేఎఫ్ నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కట్టెల మల్లేష్, గడ్డమీది అశోక్ లు మాట్లాడుతూ... మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ళు, ఇళ్లస్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా, ఇంతవరకు జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వలేదని, వెంటనే ఇవ్వాలని కోరారు. అనేక మంది జర్నలిస్టులు అనారోగ్యంతో బాధపడుతున్నారని, వారికి వెంటనే హెల్త్ కార్డులు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం జర్నలిస్టులకు సంక్షేమ పథకాలు అందజేయాలని డిమాండ్ చేశారు. వయస్సు పైబడిన సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ ఇవ్వాలన్నారు. విద్యాశాఖ అధికారులు జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలలో ఉచిత విద్య అందించాలని అన్నారు. చిన్న పత్రికలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి,ఎమ్ ప్యానల్ మెంట్లో చేర్చాలని, వ్యాపార ప్రకటనలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పత్రికలకు ప్రభుత్వం ఇవ్వాల్సిన అడ్వర్టయిజ్మెంట్ల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, మీడియా అకాడమీ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు శిక్షణ సౌకర్యాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో, జిల్లా, మండలాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులపై జరుగుతున్న దాడుల నివారణకు కమిటీలు వేయాలని, జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. మేడ్చల్ జిల్లా ప్రెస్ క్లబ్ కు స్థలం కేటాయించి భవనం నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. పై సమస్యలపై మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా జాయింట్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి స్పందించారు. తమ పరిధిలో ఉన్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని, మిగతా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు జగదీశ్వర్ గుప్తా, టిడబ్ల్యూజేఎఫ్ మేడ్చల్ జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, కావలి మోహన్, సహాయ కార్యదర్శి పి.శంకర్, చిన్న బాబు, రఫి ఉద్దీన్ ఖాద్రి, ఎస్ ఆర్ కె న్యూస్ ఛానల్ చైర్మన్, రమేష్, కొండల్ రెడ్డి, పర్వీజ్ అహ్మద్, డి. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ రాజ్ పర్యవేక్షణాధికారి... క్రాంతి కిరణ్ కు అభినందనలు



హైదరాబాద్, మహానది న్యూస్, డిసెంబర్ 12: తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనరేట్ లో సూపరింటెండెంట్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన కాసుల క్రాంతి కిరణ్ కు పలువురు జర్నలిస్టు సంఘం నేతలు అభినందనలు తెలిపారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య, ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే) జాతీయ కార్యదర్శి పులిపలుపుల ఆనందం, రాష్ట్ర నాయకులు జే.ఉదయ్ భాస్కర్ రెడ్డి తదితరులు శుక్రవారం కమీషనరేట్ లో క్రాంతి కిరణ్ ను కలిసి బొకే అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందరరేగా ఆయనను శాలువాలతో సన్మానించారు. మొన్నటి వరకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి దగ్గర పీఏ గా పనిచేసిన క్రాంతి కిరణ్ బదిలీ పై పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ గా బాధ్యతలు తీసుకున్నారు.

## రేపు టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా మహాసభ

### - జిల్లా మహా సభల పోస్టర్ ఆవిష్కరణ - మామిడి సోమయ్య సంఘం వ్యవస్థాపకులు

### - సంఘంతో వారికి సంబంధం లేదనడం అవివేకం

### - టీడబ్ల్యూజేఎఫ్ మహాసభల పేరుతో వసూళ్ళకు వచ్చే వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### - జిల్లా అడ్ హక్ కమిటీ కన్వీనర్ టిఎస్ చక్రవర్తి



**ఖమ్మం, మహానది న్యూస్, డిసెంబర్ 12:** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా మహాసభ ఈనెల 14వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ జిల్లా అడ్ హక్ కమిటీ కన్వీనర్ టిఎస్ చక్రవర్తి, కో-కన్వీనర్లు అర్వపల్లి నగేష్, నానబాల రామకృష, అంతోటి శ్రీనివాస్, వందనపు సామ్రాట్‌లు తెలిపారు. ఈనెల 9న ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగిన ఫెడరేషన్ జిల్లా సన్నాహక సమావేశంలో ఈ మేరకు నిర?యం తీసుకోడం జరిగిందని పేర్కొన్నారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ వ్యవస్థాపకులు, రాష్ట్ర మాజీ అధ్యక్షులు, ప్రస్తుత రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య నేతృత్వంలో ఈ మహాసభ జరుగుతుందని, జిల్లా లోని జర్నలిస్టులంద రూ పాల్గొనాలని వారు పిలుపు నిచ్చారు. జిల్లాలో ఫెడరేషన్ ను బలోపేతం చేసి జర్నలిస్టుల సమస్యలపై పోరాటం చేయడానికి నూతన నాయకత్వ ఎన్నిక కోసం జిల్లా మహాసభ జరుగుతుందని తెలిపారు. ఫెడరేషన్ సంఘాన్ని స్థాపించి, గత పదిహేను సంవత్సరాలుగా రాష్ట్ర వ్యాప్తంగా సంఘాన్ని బలోపేతం చేసి, జర్నలిస్టుల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తున్న మామిడి సోమయ్య కు టీడబ్ల్యూ జేఎఫ్ తో ఎటువంటి సంబంధం లేదని అనడం అవివేకమని, ఇలాంటి తప్పుడు ప్రచారాలను జర్నలిస్టులు నమ్మే పరిస్థితిలో లేరని వారన్నారు.

సంఘాన్ని ఒక పార్టీకి, ఒక పత్రికకు పరిమితం చేయాలని చూస్తున్నదెవరో, జర్నలి స్టులందరి పక్షం ఉండాలంటున్నదెవరో జర్నలిస్టులే గ్రహిస్తున్నారని, సంఘాన్ని తమ స్వప్రయోజనాలకు జేబు సంస్థగా వాడుకుంటున్నారని విమర్శించారు. సంఘం రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీల రెండేళ్ల కాలపరిమితి ముగిసి చాలా కాలమైందని, అన్ని కమిటీలు రద్దయినట్లు గత నెల 15న హైదరాబాద్ లో జరిగిన రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశంలో ప్రకటించినప్పటికీ కొందరు ఇంకా తమ పదవులను అనుభవిస్తూ, తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని వారు ధ్వజమెత్తారు. జిల్లా మహాసభల పేరుతో కొందరు వ్యక్తులు లక్షల రూపాయలు వసూలు చేసినట్లు బహిరంగ ప్రచారం జరుగుతుందని, ఇప్పటికీ వసూళ్లు చేస్తున్నట్లు తెలుస్తుందని, టీడబ్ల్యూజేఎఫ్ మహాసభల పేరుతో వసూళ్ళకు వచ్చే వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఈ మహాసభలో అర్హత కలిగిన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు, జిల్లా కమిటీ ఏర్పాటు, హెల్త్ స్కీమ్ ప్రమాద బీమా ఏర్పాటు, అక్రిడేషన్ కార్డులు, మహిళా జర్నలిస్టుల పరిరక్షణ- హక్కులు, తదితరఅంశాలపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు,వివిధ పార్టీల నాయకులు, ఆయా రంగాల ప్రముఖులు, ఫెడరేషన్ రాష్ట్ర నాయకులను ఈ మహాసభలకు ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించారు. జర్నలిస్టు మిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై మహాసభలను విజయవంతం చేయాల్సిందిగా పిలుపు నిచ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో వంగా పుంగమ గౌడ్, కప్పల మధు, కందరబోయిన, కృష, ఉపేందర్, శ్రీధర్,షకీల్, నజీర్, స్వర, అఖిల్, ప్రణయ్, హేమంత్, కాశి, శశి, శివకుమార్, అర్జున్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త జిల్లాలు... కొత్త మండలాలు..

విజయవాడ, : పీలో కొత్తగా మరో మూడు జిల్లాలు ఏర్పాటు కానున్నాయి. ఈ మేరకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. మదనపల్లె, మార్కాపురం, పోలవరం జిల్లాల ఏర్పాటుకు చంద్రబాబు ఆమోదం తెలిపారు. జిల్లాల పునర్విభజనపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘంతో సీఎం చంద్రబాబు నాయుడు గత రెండు రోజులుగా సమీక్షలు జరుపుతున్నారు. అనంతరం రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా, మదనపల్లె, మార్కాపురం జిల్లాల ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. అలాగే అద్దంకి, పీలేరు, బనగానపల్లె, మడకశిర, నక్కపల్లి రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా మరో మూడు జిల్లాలు ఏర్పాటు కానున్నాయి. మార్కాపురం, మదనపల్లె, పోలవరం జిల్లాల ఏర్పాటుకు సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆమోదం తెలిపారు. జిల్లాల పునర్విభజన, కొత్త మండలాల ఏర్పాటుపై నియమించిన మంత్రివర్గ ఉపసంఘంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గత రెండు రోజులుగా సమీక్షలు జరుపుతున్నారు. కేబినెట్ సబ్ కమిటీ సమర్పించిన నివేదికపైనా చర్చించారు. ఈ క్రమంలోనే ఏపీలో కొత్తగా రంపచోడవరం జిల్లా కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటుకు చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

# సంపాదకీయం

## పైరసీ దొంగ... రాబిన్ హుడ్డా..?!

ఇప్పుడు ఎక్కడ చూసినా సరే ఐ బొమ్మ రవి పేరే వినిపిస్తుంది. మారుమూల పల్లెటూర్లలో కూడా రవి పేరు మార్మోగిపోతుంది. పోలీసుల వెర్షన్‌లో అతడో పైరసీ దొంగ. టాలీవుడ్ కోణంలో అతడో రాబిన్‌హుడ్.. సామాన్యుల మాటల్లో అతడో చిన్నపాటి దేవుడు. ఇలా ఐబొమ్మ రవి చుట్టూరా ఒక రక్తి కట్టించే వెబ్‌సిరీస్ పరుగులు పెడుతోంది.రవి..ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో టాక్ ఆఫ్‌ది టౌన్‌గా మారాడు. ఎవడైనా దొంగ దొరికితే, చట్టప్రకా రం శిక్షించండి అన్నది అన్ని వర్గాల నుంచి వచ్చే మాట. కానీ ఐబొమ్మరవిని దొంగ అంటూనే దేవుడుగా కీర్తిస్తోంది ప్రేక్షకుల లోకం. అసలు దొంగలు టాలీవుడ్‌లోనే ఉన్నారంటూ రివర్స్ అటాక్‌కు దిగుతున్నారు మరికొందరు. ఎవరి వాదన ఎలా ఉన్నా..ఇప్పుడు ఐబొమ్మరవి రాబిన్‌హుడ్‌తో పోల్చుతున్నారు. పోలీసులు, సినీ ఇండస్ట్రీ చీటర్, హ్యాకర్ అంటున్నా సరే సామాన్య జనాలు మాత్రం మా హీరో అంటున్నారు. ఇంతకీ ఐ బొమ్మ రవి ఇంత భారీ మద్దతు ఎలా కూడగట్టాడు అనేదే ఇక్కడ అందరికీ వస్తున్న ప్రశ్న. దానికి కారణం కూడా సినిమా ఇండస్ట్రీ అనే చెప్పాలి. అవును సినిమా వాళ్లు చేస్తున్న పనుల వల్లే ఐ బొమ్మ రవి సామాన్యుల హీరో అయ్యాడు. సింగిల్ థియేటర్ల ప్లేస్ లో మల్టీప్లెక్స్ లు వచ్చి పడ్డాయి. టికెట్ కౌంటర్ క్లోజ్ అయి బుక్ మై షో లాంటివి వచ్చేసాయి. ప్రతి సినిమాకు విపరీతంగా టికెట్ రేట్లు పెంచేసి అమ్ముకుంటున్నారు. పైగా ప్రభుత్వాలు స్పెషల్ జీవోలు ఇచ్చి మరి బెనిఫిట్ షోలు, టికెట్ రేట్ల పెంపు లాంటివి చేయడం వల్ల సామాన్యులు సినిమా థియేటర్లకు వెళ్లి సినిమాలు చూసే పరిస్థితి లేకుండా పోయింది. వీటికి తోడు ఒక ఫ్యామిలీ సినిమా థియేటర్ కు వెళితే పాప్ కార్న్, సమోసాలు, కూల్ డ్రింక్స్, వాటర్ బాటిల్ లాంటివి బయట దొరికే రేట్ల కంటే 20 రెట్లు ఎక్కువగా పెంచేసి అమ్మడంతో సామాన్యుల జేబుకు చిల్లు పడుతుంది.పైరసీ తప్పయితే సినిమా టికెట్ల రేట్లు పెంచడమూ తప్పే.. ఒక ఇంట్లో నలుగురం సినిమాకు పోతే మూడు వేలు ఖతం అవుతున్నాయి.. ఐ బొమ్మలో ఫ్రీగా ఇంటిల్లిపాదీ సినిమా చూస్తున్నం.. అంటున్నారు నెటిజెన్లు.. ఇంతకు సినిమా నిర్మాతలను వందల కోట్లు పెట్టి ఎవరు సినిమాలు తీయుమన్నారంటూ ప్రశ్నిస్తున్నారు..? మొన్నటి ప్రెస్ మీట్ లో ఐ బొమ్మ రవిని ఎన్ కౌంటర్ చేయాలన్న నిర్మాత సీ కల్యాణ్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయన చేసిన తప్పుల చిట్టాను ఎత్తి చూపుతున్నారు. పైరసీ చేసే వాళ్లు సంఘ సేవల చేయట్లేదన్న ఎస్ఎస్ రాజమౌళికీ నెటిజెన్లు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. మీరేమైనా సంఘ సేవ చేస్తున్నారా..? వినోదం పేరుతో బిజినెస్ చేస్తున్నారు కదా..? మిమ్మల్ని విదేశాలకు వెళ్లి ఎవరు షూటింగులు చేయుమన్నారని ప్రశ్నిస్తున్నారు.. వందల కోట్లు పెట్టి ఎవరు సినిమా తీయుమన్నారంటూ సీరియస్ అవుతున్నారు. సినిమాను పైరసీ చేయడం తప్పయితే టికెట్ల రేట్లు పెంచుకోవడం కూడా తప్పే అని ముక్త కంఠంతో వాదిస్తున్నారు. మన తెలుగు రాష్ట్రాల్లో సినిమాలను విపరీతంగా ఇష్టపడే జనాలు ఎక్కువ. సినిమాలు చూడాలనే ఆశ ఉన్నా సరే కుటుంబాన్ని తీసుకొని వెళ్లి చూడగలిగే పరిస్థితులు లేకపోవడంతో సామాన్యులు అందరూ కూడా ఐ బొమ్మను ఎంచుకున్నారు. వేలు పెడితే గాని సినిమా చూడలేని వాళ్లకు ఉచితంగా ఐ బొమ్మలో సినిమాలు చూసే అవకాశం రావడం వల్ల థియేటర్లకు వెళ్లి సినిమాలు చూసేవాళ్ళు చాలా తగ్గిపోయారు. క్రమక్రమంగా ఇది పెరిగి థియేటర్లకు వెళ్లే వాళ్ళ సంఖ్య భారీగా తగ్గిపోయి ఐ బొమ్మకు విపరీతంగా క్రేజ్ పెరిగింది. బొమ్మరవికి సోషల్ మీడియాలో రోజురోజుకు మద్దతు పెరుగుతోంది. సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో 'ఐబొమ్మ' ట్రెండింగ్‌లో ఉంది. పేదలు, మధ్య తరగతి వాళ్ల కోసమే పైరసీ చేశాడంటూ పోస్టులు పెడుతున్నారు. థియేటర్ రేట్లు భారీగా పెంచడం వల్లే ఐబొమ్మకు అలవాటు పడ్డామంటూ ట్వీట్లు కూడా వస్తున్నాయి. సామాన్యులకు అందనంత రేట్లు పెంచి సినిమా థియేటర్లకు రానివ్వని పరిస్థితి తీసుకొచ్చింది టాలీవుడ్‌లోని కొందరు పెద్దలే అంటూ ఐబొమ్మరవిని దేవుడిని చేసి చూస్తోంది ప్రేక్షకలోకం. అతడు తమ దృష్టిలో హీరో అని, అసలు విలన్ టాలీవుడే అని పాయింట్‌తో ఐబొమ్మ రవికి అండగా నిలుస్తున్నారు కొందరు ప్రేక్షకులు. తాజాగా ఖమ్మంలో ఓ ఆటో డ్రైవర్ తన వాహనంపై ఏకంగా ఇమ్మది రవి ఫోటో వేయించాడు. తెలంగాణ రియల్ హీరో ఐబొమ్మ రవి అంటూ అక్కడ రాసుకొచ్చాడు. ప్రజంట్ ఆ దృశ్యాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.ఈరేంజ్‌లో ఐబొమ్మరవికి సపోర్ట్ వస్తుందని పోలీసులు, ఇటు టాలీవుడ్ పెద్దలు కూడా ఊహించలేదు. రవిని హీరోగా చూడటాన్ని ఇండస్ట్రీ ఖండిస్తోంది. ఐబొమ్మ రవిని సోషల్ మీడియా దేవుడిగా చూడటం మానుకోవాలని విజ్ఞప్తి చేస్తోంది. అయితే ఐ-బొమ్మ రవి అరెస్ట్‌పై సీనియర్ అడ్వొకేట్, నటుడు సివిఎల్ నరసింహారావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఐ బొమ్మ రవిని అంతా రాబిన్‌హుడ్‌లా చూస్తున్నారని, ప్రజలు ఇబ్బందులు పడితే.. సినిమాల్లో మాదిరిగా ఒకడు పుట్టుకొస్తాడని రవి నిరూపించాడన్నారు.ఐబొమ్మ రవికి నెటిజెన్ల నుంచి పెద్ద సపోర్ట్ లభిస్తోంది. ఏకాణ తీసుకోకుండా కొత్త సినిమాలు చూపిస్తున్నాడంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. మధ్య తరగతి దేవుడనీ పోస్టులు పెడుతున్నారు. ఠాగూర్ సినిమాలో చిరంజీవి మాదిరిగా తారీఫ్ చేస్తున్నారు. అరెస్టు చేసిన పోలీసుపై ఏకంగా మీమ్స్ చేస్తున్నారు. దీనిపై సీపీ సజ్జనార్ మండిపడ్డారు. ఐ బొమ్మ రవిని అరెస్టు చేస్తే ప్రజలు తమపై మీమ్స్ చేస్తున్నారని, వారిపైనా కేసులు పెడతామంటూ హెచ్చరించారు. దీనిపైనా నెటిజెన్లు గట్టిగానే స్పందించారు. బంగారం దుకాణంలో చోరీ జరిగితే షాపు యజమానులను పక్కన కూర్చోబెట్టుకొని ప్రెస్ మీట్ పెడతారా..? సీపీగారూ..? అంటూ ప్రశ్నిస్తున్నారు. నిర్మాతలు, సినిమా హీరోలు, దర్శకులతో కలిసి సీపీ సజ్జనార్ ప్రెస్ మీట్ పెట్టడాన్ని తప్పు పడుతున్నారు. ఐ బొమ్మ రవి రియల్ హీరో అని రియల్ రాబిన్ హుడ్ అని పేర్కొంటున్నారు. ఆయన వెర్షన్‌లో అయితే సైబర్ క్రైమ్‌ను అడ్డుకునేందుకు ఐబొమ్మ రవిని డిపార్ట్‌మెంట్‌లోకే తీసుకోవాలని అప్పీల్ చేస్తున్న పరిస్థితి. ఈరేంజ్‌లో ఐబొమ్మరవికి క్రేజ్ పెరిగింది.థియేటర్లలో లక్ష మంది చూస్తే ఐ బొమ్మలో 50 లక్షల మంది చూసే వాళ్ళు ఉన్నారు. ఇప్పుడు ఐ బొమ్మ రవిని అరెస్టు చేయటంతో ఉచితంగా సినిమాలు చూసే అవకాశం లేకుండా పోయింది. అందుకే సామాన్య జనాలు అందరూ కూడా ఇప్పుడు ఐ బొమ్మ రవికి ఇంతగా సపోర్ట్ చేస్తున్నారు బయటకు రావాలని కోరుకుంటున్నారు. మరి ఐ బొమ్మ రవి బయటకు వస్తాడా లేదా అనేది చూడాలి.

# దేశంలో ఫార్మసీ రంగానికి ఉజ్వల భవిష్యత్తు

### -తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి



హైదరాబాద్, మహానది న్యూస్, డిసెంబర్ 12: దేశంలో ఫార్మసీ రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉందని ప్రణాళిక బద్ధంగా చదివితే ఉన్నత స్థాయికి ఎదుగొచ్చని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాల కిష్టారెడ్డి అన్నారు. శుక్రవారం బర్కత్ పురలోని రాజా బహదూర్ వెంకటరామారెడ్డి ఫార్మసీ మహిళా కళాశాల 3వ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. నేడు ఫార్మసీ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు రావడం జరిగిందని విద్యార్థులు ఎప్పటికప్పుడు నూతన ఆవిష్కరణలపై దృష్టి కేంద్రీకరిస్తేనే ఫార్మసీపై పట్టు సాధించవచ్చన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించాలంటే లక్ష్యాన్ని ఎంచుకుని ప్రణాళికా బద్ధంగా కష్టపడి చదివినప్పుడే ఆ లక్ష్యాన్ని చేరడం సాధ్యమవుతుందన్నారు. ఒక ఆలోచన జీవితాన్నే మార్చివేస్తుందని విద్యార్థులు తమ ఉన్నత భవిష్యత్తు గురించి ఎంతో ఆలోచించాలని సూచించారు. విద్యార్థులు ఒత్తిడితో కాకుండా ఇష్టపడి చదివినప్పుడే అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారని తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ పరీక్షల విభాగం కంట్రోలర్ ప్రొఫెసర్ శశికాంత్ మాట్లాడుతూ భారత దేశం ప్రస్తుతం ఫార్మసీ, డ్రగ్ రంగాలలో ఎంతో ఉన్నత స్థాయిలో ఉందన్నారు. హెల్త్ కేర్ రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. విద్యార్థులు తమలోని నైపుణ్యాలను గుర్తించాలని, వారికి వచ్చే మంచి ఆలోచనలే వారి జీవితాలను మలుపు తిప్పుతాయని చెప్పారు. మార్కుల కోసం కాకుండా విజ్ఞానం కోసం విద్యాభ్యాసం చేయాలన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాల, విశ్వవిద్యాలయం, దేశ గౌరవాన్ని కాపాడుతామని గ్రాడ్యుయేట్స్ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ మహిళా విద్యా సంఘం గౌరవ కార్యదర్శి, కళాశాల కార్యదర్శి ప్రొఫెసర్ కట్టా ముత్యంరెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుమాకాంత్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కళాశాల సిబ్బంది, లెక్చరర్స్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో... మధ్యాహ్న బోజనం ఏర్పాటు చేయాలి -ఎమ్మెల్సీ కవిత డిమాండ్





హైదరాబాద్, మహానది న్యూస్,డిసెంబర్ 12: రాష్ట్రంలోని పేద విద్యార్థులు చదువుకుంటున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల ఉత్తీర్ణశాతం పెంచేందుకు వారికి మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. జాగృతి జనం బాటలో భాగంగా అంబర్‌పేట నియోజకవర్గం లోని కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం ఆమె సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి కళాశాలలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, విద్యార్థులను కళాశాలకు రప్పించడంలో, చదివించడంలో అధ్యాపకులు బాధ్యతగా పనిచేస్తున్నారని ఆమె చెప్పారు. విద్యార్థుల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. లేని పక్షంలో జాగృతి ద్వారా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామన్నారు. కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పడి దాదాపు 60 సంవత్సరాలు అయినా, చిన్న చిన్న మరమ్మతులు చేశారే తప్ప భవనానికి రంగులు లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. ఒకే సముదాయంలో ప్రైమరీ స్కూల్, ప్రైమరీ స్కూల్ బాలికల హాస్టల్, హై స్కూల్ తో పాటు ప్రభుత్వ జూనియర్ కాలేజీలు నడుస్తున్నాయని, నూతనంగా భవనాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

# అదే వంచన!



ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్రంలో తాజాగా పర్యటించినా ఎటువంటి మేలు చేయకుండా ఆ వంచన బాటనే కొనసాగించడం దారుణం. రూ.13,400 కోట్ల పేరుతో ప్రారంభించిన 16 ప్రాజెక్టుల్లో కర్నూలు జిల్లాకు, రాయలసీమకు చెందినవి స్వల్పమే! ఇతర రాష్ట్రాల ప్రాజెక్టులను ఇక్కడ నుండి ప్రారంభించి ఈ రాష్ట్రానికి ఇచ్చినట్లు ప్రచారం చేయడం మోడీ సర్కారుకే చెల్లింది. రాష్ట్ర విభజన సందర్భంగా కర్నూలు జిల్లా పంచలింగాల వద్ద రైల్వేవ్యాగన్ వర్క్‌షాపు, ఆదోని వద్ద టెక్స్‌టైల్ పార్కు, కడపలో స్టీలుప్లాంటు ఏర్పాటు చేస్తామని చెప్పిన వాటికి అతీగతి లేదు. గతంలో టిడిపిని విమర్శించి, రాయలసీమ డిక్లరేషన్ పేరుతో రూ.20 వేల కోట్లు స్పెషల్ ప్యాకేజీని డిమాండ్ చేసిన బిజెపి ఇప్పుడా ఊసే ఎత్తుకోవడం లేదు. డబుల్ ఇంజన్ సర్కారు అని చెబుతూ బిజెపి నాయకులెవరూ దీని గురించి మాట్లాడటమే లేదు. బిజెపి అధికారంలోకి ఉండీ వారు ప్రకటించిన రాయలసీమ డిక్లరేషన్ అమలు చేయకపోవడంపై ప్రజలకు సంజాయిషీ చెప్పుకోవలసిందిపోయి మౌనం దాల్చడం వారికే చెల్లింది. తిరుపతి వెంకన్న సాక్షిగా 2014 ఎన్నికల సభలో నరేంద్ర మోడీ చెప్పిన ప్రత్యేక హోదా, విభజన హామీలను అధికారానికొచ్చాక గాలికొదిలేశారు. ఢిల్లీని తలదన్నేలాంటి రాజధాని నిర్మిస్తామని ఆనాడు గొప్పలు చెప్పగా ఇప్పుడు కర్నూలు సభలో 'ఢిల్లీ, అమరావతి కలిసి అభివృద్ధి వైపు నడుస్తున్నాయ'ని ప్రధానమంత్రి ఉద్ఘాటించడం కూడా అలాంటిదే! నాటి మాటలకు వెంకన్న మౌన సాక్షి కాగా ఇప్పుడు శ్రీశైల మల్లన్న వంతయింది. దేవుళ్ల సంగతి ఎలా వున్నా అప్పటి నుండి ఇప్పటికీ మోసపోతున్నది మాత్రం తెలుగు ప్రజలే! సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ అంటూ పాలకులు ఊదరగొడుతున్నారు కానీ నిజంగా జరిగే సేవింగ్స్ ఏడాదికి తలసరి రూ.1600 మాత్రమేనని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. మరి పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలతో పోల్చితే ఇది ఏపాటిది? కార్లు, ఎయిర్ కండిషనర్లు, భారీ స్క్రీన్ టీవీల వంటివాటికి తగ్గిందేతప్ప బియ్యం, ఉప్పు, పప్పుల జిఎస్‌టి తేడా లేదన్న సంగతి అందరికీ తెలిసిందే! ప్రధాని మాట్లాడుతూ వికసిత భారత్‌కు స్వర్ణాంధ్రప్రదేశ్ మరింత తోడ్పడనుందని, డబుల్ ఇంజన్ సర్కార్‌లో ఎ.పి సామర్థ్యాన్ని మరింత పెంచబోతున్నామని తెలిపారు. 2047 నాటికి వికసిత్ భారత్ సాకారమవుతుందన్నారు. చంద్రబాబు విజన్‌ను ప్రశంసించారు. చంద్రబాబు నేతృత్వంలో ఆత్మ నిర్భర భారత్‌లో రాష్ట్రం ఒక కొత్త శక్తిగా మారుతుందని పేర్కొన్నారు. ఇంకేముంది%ౌ%రాష్ట్రానికి మోడీ సహాయం మరువలేనిదని, అమరావతిని నిలబెట్టామని, పోలవరాన్ని గాడిన పెట్టామని, విశాఖ ఉక్కును నిలబెట్టామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఒకటే పొగడ్తలు%ౌ% ఎనిమిదేళ్లపాటు వీరబాదుడు బాదినా ఇప్పుడు జిఎస్‌టి సంస్కరణలు తీసుకొచ్చినందుకు మోడీకి ధన్యవాదాలు చెప్పేశారు. ఆపైన డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ కూడా మోడీని పొగడ్తలతో ముంచెత్తారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆయనతో పోటీ పడేలా రాష్ట్రంలో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ నడుస్తోందన్నారు. సభ పరస్పర పొగడ్తలతోనే సాగిపోయింది. ఇదే సభలో కరెంటు షాక్‌తో అర్జున్ అనే యువకుడు మరణిస్తే అధికార కూటమి వారి కుటుంబాన్ని పట్టించుకోలేదు. ఒక రోజు గడిచాక అరకొర ఆర్థిక సహాయం ప్రకటించారు. నాయకులను పెద్ద సంఖ్యలో గృహ నిర్బంధం చేశారు. సుగాలి ప్రీతి తల్లిని నిర్బంధించారు. అదోనిలో విద్యార్థి నాయకులను సైతం అరెస్టు చేయడం అక్రమం. ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్ర పర్యటనకు వచ్చినప్పుడల్లా వందల కోట్ల ప్రజాధనం వ్యయమవుతున్నదే తప్ప రాష్ట్రానికి ఎటువంటి మేలూ చేకూరడం లేదు. గత పదకొండేళ్లుగా సాగిస్తున్న వంచన బాటనే కమలనాథులు ఎల్ల కాలమూ కొనసాగిస్తే ప్రజలు సహించరు. ప్రజలు తమ అనుభవంలో తెలుసుకొని బిజెపి మోసపూరిత విధానాలను తిప్పి కొడతారు.

# ఆదినా మసీదుపై మరోమారు వివాదం

### యూసుఫ్ పఠాన్ పోస్ట్‌తో తిరిగి గందరగోళం

కోల్‌కతా: భారత మాజీ క్రికెటర్, తృణమూల్ కాంగ్రెస్ టీఎంసీ ఎంపీ యూసుఫ్ పఠాన్ చేసిన ఒక సోషల్ మీడియా పోస్ట్ పశ్చిమ బెంగాల్‌లో తీవ్ర రాజకీయ దుమారం రేపింది. మాల్దా జిల్లాలోని చారిత్రక అదినా మసీదుపై ఆయన చేసిన పోస్ట్‌తో పాత వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. ఈ కట్టడం మసీదు కాదని, అది ఆదినాథ్ ఆలయం అని బిజెపి వాదిస్తోంది యూసుఫ్ పఠాన్, మాల్దాలోని అదినా మసీదును సందర్శించిన ఫొటోలను 'ఎక్స్' లో పంచుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని మాల్దాలో ఉన్న అదినా మసీదు ఒక చారిత్రక కట్టడం. దీనిని 14వ శతాబ్దంలో ఇలియాస్ షాహీ వంశానికి చెందిన రెండో పాలకుడు సుల్తాన్ సికం దర్ షా నిర్మించారని అంటారు. 1373-1375 మధ్య కాలంలో నిర్మించిన ఈ మసీదు, అప్పట్లో భారత ఉపఖండంలోనే అతిపెద్దదిగా ఉండేది' అని పఠాన్ తన పోస్టులో పేర్కొన్నారు.పఠాన్ పోస్ట్ చేసిన కొద్దిసేపటికే బిజెపి బెంగాల్ శాఖ దీనిపై తీవ్రంగా స్పందించింది. అది అదినా మసీదు కాదని, ఆదినాథ్ ఆలయమని కౌంటర్ ఇచ్చింది. ఇదే సమయంలో పలువురు సోషల్ మీడియా యూజర్లు కూడా ఈ చర్చలో పాల్గొన్నారు. అనేక చారిత్రక ఆధారాలను ఉటంకిస్తూ, ఒక హిందూ దేవాలయాన్ని ధ్వంసం చేసి దానిపై ఈ కట్టడాన్ని నిర్మించారని యూసుఫ్ పఠాన్‌కు సూచించారు. ఆదినా మసీదు వివాదాలకు కేంద్రంగా నిలవడం ఇదే మొదటిసారి కాదు. గత ఏడాది, వృందావన్‌కు చెందిన విశ్వవిద్యా ట్రస్ట్ అధ్యక్షుడు హిరణ్మోరు గోస్వామి నేతృత్వంలోని పూజారుల బృందం ఈ కట్టడంలోకి ప్రవేశించి హిందూ సంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహించింది. కట్టడం లోపల హిందూ దేవతల విగ్రహాలు ఉన్నాయని, ఇది ఒకప్పుడు ఆలయమేనని వారు వాదించారు.స్థానికుల సమాచారంతో పోలీసులుఅక్కడికి చేరుకుని వారిని అడ్డుకు న్నారు. ఈ ఘటన తర్వాత, భారత పురావస్తు శాఖ గోస్వామిపై కేసునమోదు చేసింది. వివాదం నేపథ్యంలోజాతీయ ప్రావ ఖ్యత కలిగిన ఈ కట్టడాన్ని అధికారులు మూసివేశారు. భద్రతను కట్టుదిట్టం చేసి సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు, ఒక పోలీస్‌చెక్‌పోస్ట్‌నుకూడా నెలకొల్పారు.అదినామసీదును 1369లో బెంగాల్ సుల్తానేట్‌కు చెందిన సికందర్ షా నిర్మించారు. ఇది ఆ కాలపు ముస్లిం వాస్తుశిల్పానికి ఒక అద్భుతమైన ఉదాహరణ అని ఏఎస్ఐ పేర్కొంది. సికందర్ షా సమాధి కూడా ఇందులోనే ఉంది. తాజా పరిణామాలతో ఈ చారిత్రక కట్టడం మరోసారి వార్తల్లోకెక్కింది.

# స్వచ్ఛమైన గాలి..ఆరోగ్యక జీవనం
# కాలుష్యం కట్టడితో సాధ్యం
### స్వచ్ఛాంధ్రలో కలెక్టర్ పిలుపు

విజయవాడ: స్వచ్ఛమైన గాలితో మనం ఆరోగ్యకరంగా జీవన ప్రయాణం కొనసాగించ వచ్చని.. ఆరోగ్య ఆంధ్ర దిశగా అడుగులు వేస్తూ కాలుష్య కట్టడికి సమష్టిగా కృషిచేద్దామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. క్టోబర్ నెల మూడో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా తిరువూరు మండలం,లక్ష్మీపురం గ్రామంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లాకలెక్టర్ డా.జి.లక్ష్మీశ,శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరా వు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. మొక్కలు నాటిన అనంతరం స్థానిక రైతులకు కిలో రూ.10కేవర్మీ కంపోస్టును అందజేశారు. ప్రాంగణంలో ఏర్పాటుచేసిన అంగన్వాడీ, వైద్య ఆరోగ్యశాఖ, పీఎం సూర్యఘర్ స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర అ 2047 సాకారానికి ముందడుగుగా ప్రతిఒక్కరూ స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్రకు కృషిచేయాల్సిన అవసరముందని.. ప్రజారవాణా వ్యవస్థను ఉపయోగించడం, విస్తృతంగా మొక్కలు నాటడం, సౌర విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధన వనరులను వినియోగించడం, పరిశ్రమల్లో కాలుష్యాన్ని తగ్గించే విధానాలను అనుసరించడం, పంట అవశేషాల్ని కాల్చకుండా నివారించడం వంటివి పాటించాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి నెలా మూడో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా ఈ రోజు క్లీన్ ఎయిర్ (స్వచ్ఛమైన గాలి) ఇతివృత్తంతో కార్యక్రమాలు ఏర్పాటుచేసినట్లు వివరించారు. మన దైనందిన జీవితంలో పర్యావరణహిత మార్గాలను అనుసరించడం ద్వారా మన భావితరాలకు స్వచ్ఛమైన గాలిని అత్యంత విలువైన బహుమతిగా అందిద్దామని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. ర్యావరణ పరిరక్షణకు, మానవ ఆరోగ్యానికి రెండింటికీ స్వచ్ఛమైన గాలి అత్యంత అవసరమని.. కాలుష్యాన్ని కట్టడి చేయడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరముందన్నారు. గాలి కాలుష్యం వల్ల శ్వాసకోశ సమస్యలతో పాటు వివిధ అనారోగ్య సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. పర్యావరణానికి హాని కలిగించే టపాసులు ఉపయోగించకుండా పర్యావరణహితంగా దీపావళి పండగను ఆనందోత్సాహాలతో జరుపుకుందామని, నిత్య జీవితంలో పర్యావరణహిత విధానాలను అనుసరిద్దామని శాసనసభ్యులు కొలికపూడిశ్రీనివాసరావు పేర్కొన్నారు.

# అపార్ట్ మెంట్ వద్దనుకుంటున్నారోచ్

హైదరాబాద్:కాస్త దూరంగా పోయి అయినా ఇండిపెండెంట్ ఇళ్లే కొనాలనుకునేవారు చాలా మంది ఉన్నారు. అలాంటి వారి కోసం హయత్ నగర్ హాట్ ఫేవరేట్ గా మారింది. చిన్న బిల్డర్లు 100 చదరపు గజం నుంచి 300చదరపు గజాల వరకు ఇళ్లను నిర్మిస్తున్నారు, ధరలు 45 లక్షలనుంచి 1కోటి వరకు చెబుతున్నారు. హయత్‌నగర్‌చుట్టూ రెసిడెన్షియల్ ప్లాట్లు ఇంకా అందుబాటులో ధరల్లోనే ఉన్నాయి, ముఖ్యంగా ఔటర్ రింగ్ రోడ్ సమీపంలో చదరపు గజానికి ?35,000 నుంచి-50,000 వరకు. పెద్ద అంబర్‌పేట్‌లో -32, 000 నుంచి -54,000 వరకు, పసుమాముల , తట్టి అన్నారంలో ?42,000 నుంచి -60,000 వరకు ధరలు ఉన్నట్లుగా రియల్ ఎస్టేట్ బ్రోకర్లు చెబుతున్నారు.హయత్‌నగర్ సమీపంలో భూమి ధరలు ఇతర ప్రాంతాలతో పోలిస్తే తక్కువగా ఉన్నాయి. ఔటర్ రింగ్ రోడ్ సమీపంలో ఎకరానికి-3-4.5 కోట్లు, కొంచెం లోపల ?2-3 కోట్లు. రియల్ ఎస్టేట్ నిపుణులు, రీజియనల్ రింగ్ రోడ్ మరియు రింగ్ రైల్ వంటి అవసర సదుపాయాలు మొదలైన తర్వాత భూమి మరియు రెసిడెన్షియల్ ప్లాట్ ధరలు గణనీయంగా పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. అపార్టుమెంట్లు కూడా విరివిగా నిర్మిస్తున్నారు. చదరపు అడుగుకు -3,400 నుంచి -4,200 వరకు. డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్:-45లక్షల నుంచి -52 లక్షలు. ట్రిపుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్: 55 లక్షల నుంచి -65 లక్షలు. రామోజీ ఫిల్మ్ సిటీ చుట్టూ కొన్ని డెవలపర్లు విల్లాలు నిర్మిస్తున్నారు. హయత్‌నగర్‌కు ఔటర్ రింగ్ రోడ్, విజయవాడ జాతీయ రహదారి ద్వారా మెరుగైన కనెక్టివిటీ ఉంది .

# ఆరోగ్యానికి చిన్నపరీక్ష!



జెస్టేషనల్ డయాబెటిస్.. మహిళల్లో గర్భధారణ సమయంలో కనిపిస్తుంది. చాలామందిలో ప్రసవం తర్వాత తగ్గిపోతుంది. కానీ, మూడింట ఒకవంతు మంది మహిళలు.. డెలివరీ తర్వాత కూడా షుగర్ వ్యాధితో బాధపడుతున్నారట. ఈ క్రమంలో కాన్పు తర్వాత 'గ్లూకోజ్ టాలరెన్స్ టెస్ట్' చేయించుకోవాలని ఆరోగ్య నిపుణులు సలహా ఇస్తున్నారు. కానీ, చాలామంది మహిళలు ఈ పరీక్షలు చేయించుకోవడానికి ఆసక్తి చూపడం లేదు. ప్రసవం తర్వాత పిల్లల కోసమే పూర్తి సమయాన్ని కేటాయిస్తూ.. తమ ఆరోగ్యాన్ని పట్టించుకోవడం లేదు. 'టాలరెన్స్ షుగర్ పరీక్ష'కు చాలామంది మహిళలు విముఖత చూపుతున్నారని తాజా పరిశోధన ఒకటి తేల్చింది. కెనడాకు చెందిన లునెన్‌ఫీల్డ్ – టానెన్‌బామ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ చేపట్టిన ఈ పరిశోధన వివరాలను 'డయాబెటిస్ కేర్' ప్రచురించింది. ఇందులో పేర్కొన్న వివరాల ప్రకారం.. 'గ్లూకోజ్ టాలరెన్స్' పరీక్ష చేయించుకోవాలంటే.. బాలింతలు రాత్రిపూట ఉపవాసం ఉండి, మరుసటి రోజు ఉదయం పరీక్షకు రావాల్సి ఉంటుంది. శాంపిల్ ఇచ్చిన తర్వాత.. ఆహారం తీసుకొని, మళ్లీ రెండు గంటలపాటు వేచి ఉండి, మరోసారి రక్తం శాంపిల్ ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో, ఎక్కువ సమయంపాటు వేచి చూడటం, రాత్రిపూట ఉపవాసం.. ఇలాంటి కారణాలతో మహిళలు ఈ పరీక్ష చేయించుకోవడానికి విముఖత చూపుతున్నారట. ఈ సమస్యను గుర్తించిన అంతర్జాతీయ డయాబెటిస్ సమాఖ్య.. ఈ పరీక్ష వ్యవధిని ఒక గంటకు తగ్గించాలని సిఫార్సు చేసింది. ఇలా, ఒక గంటలో పూర్తిచేసే పరీక్ష.. రక్తంలో చక్కెర స్థాయులను కచ్చితంగా అంచనా వేస్తుందని పరిశోధనలో తేలింది. ఇందులో భాగంగా.. 369 మంది మహిళలను ఎంపికచేసింది. వీరిలో కొందరికి ప్రసవానంతరం రెండు గంటల టాలరెన్స్ టెస్ట్ చేయగా.. మరికొందరికి గంటలో పూర్తయ్యే పరీక్ష నిర్వహించారు. ఆశ్చర్యకరంగా.. రెండు రకాల పరీక్షల ఫలితాలు సరిపోలినట్టు పరిశోధకులు వెల్లడించారు. ఈ చిన్న పరీక్షతో భవిష్యత్తులో షుగర్ వ్యాధి ముప్పు నుంచి తప్పించుకోవచ్చని చెబుతున్నారు.

# వ్యర్థం కాదు.. బలం!

చెత్తబుట్టలో పడేసే వంటింటి వ్యర్థాలు.. పెరటి మొక్కలకు బలాన్ని ఇస్తాయి. సహజసిద్ధమైన ఎరువుగా పనిచేసి.. మొక్కలు ఏపుగా పెరిగేందుకు సాయపడతాయి. మట్టిసారాన్ని పెంచడంతోపాటు రసాయనాల ముప్పునూ తగ్గిస్తాయి. మరి.. మొక్కల ఎదుగుదలను ప్రోత్సహించే ఆ పదార్థాలేంటో తెలుసుకుందామా!.%శ్రీ% ఆరోగ్యానికి మేలుచేసే గ్రీన్ టీ.. మొక్కల ఎదుగుదలలోనూ ముందుంటుంది. వేడినీటిలో ముంచి పక్కన పడేసిన 'గ్రీన్ టీ' బ్యాగుల్లోని తేయాకును ఒక గిన్నెలోకి తీసుకోవాలి. ఇది మొక్కలకు సహజ ఎరువుగా పనిచేస్తుంది. దీన్ని అలాగే మొక్కల మొదళ్లలో వేస్తే సరిపోతుంది. దీంతోపాటు ఒక లీటర్ నీటిలో కొన్ని గ్రీన్ టీ బ్యాగులు వేసి.. కొన్ని గంటల పాటు నాననివ్వాలి. ఆ తర్వాత టీ బ్యాగులను బాగా పిండేసి.. ఆ నీటిని మొక్కలపై పిచికారీ చేయాలి. ఇలా చేస్తే.. మొక్కలు మరింత ఏపుగా పెరుగుతాయి.

మొక్కలను చీడపీడల నుంచి కాపాడటంలో ఉల్లిపొట్టు కీలకపాత్ర పోషిస్తుంది. బయట పడేసే ఉల్లిపొట్టును మొక్కల పాదల్లో వేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది. ఐదు లీటర్ల గోరు వెచ్చని నీటిలో 20



–30 గ్రా. ఉల్లిపొట్టు వేసి.. నాలుగు రోజులపాటు పక్కన ఉంచాలి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని మొక్కలపై పిచికారీ చేస్తే.. మొక్కలకు బలం వస్తుంది. తొక్కే కదా!' అని పారేసే అరటి తొక్కలోనూ.. మొక్కలకు అవసరమయ్యే పోషకాలు ఎన్నో ఉంటాయి.


అరటిపండు తొక్కల్ని మొక్కల మొదళ్ల వద్ద వేసి.. దానిమీద కొద్దిగా మట్టిని కప్పాలి. కొన్నిరోజులకు ఆ తొక్కలు మట్టిలో కలిసిపోయి.. ఎరువుగా మారుతాయి. ముఖ్యంగా, పూల మొక్కలు విరివిగా పూసేందుకు ఈ ఎరువు అద్భుతంగా పనిచేస్తుంది.

# వాల్ నట్స్‌ను రోజూ తింటే ఎన్ని పోషకాలు లభిస్తాయో తెలుసా..?

మన శరీరానికి పోషకాలను అందించే ఎన్నో రకాల ఆహారాలు మనకు అందుబాటులో ఉన్నాయి. ఎవరైనా సరే తమ ఇష్టాలు, అభిరుచులకు అనుగుణంగా, తమ స్థోమతను బట్టి ఆయా ఆహారాలను తింటుంటారు. అయితే పోషకాల విషయానికి వస్తే మనకు నట్స్ ఎంతో దోహదం చేస్తాయని చెప్పవచ్చు. నట్స్‌లో వాల్ నట్స్ మనకు ఎక్కువ లాభాలను అందిస్తాయి. కానీ జీడిపప్పు, బాదంపప్పు అంటే చాలా మందికి ఇష్టంగా ఉంటుంది. వాల్ నట్స్ ను వాటి రుచి కారణంగా చాలా మంది తినరు. అయినప్పటికీ వీటిల్లోనే పోషకాలు అధికంగా ఉంటాయి. వాల్ నట్స్‌ను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. వాల్ నట్స్‌ను రోజూ నానబెట్టి తినాలని వారు సూచిస్తున్నారు. వాల్ నట్స్‌లో మన శరీరానికి అవసరం అయ్యే అనేక పోషకాలు ఉంటాయి.

అధిక బరువు తగ్గుతారు..: వాల్ నట్స్‌లో ఆల్ఫా–లినోలీనిక్ యాసిడ్ (ఆలా) అనే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. హార్ట్ ఎటాక్ రాకుండా చూస్తాయి. అలాగే మెదడు పనితీరును మెరుగు పరుస్తాయి. మెదడు యాక్టివ్‌గా పనిచేసేలా చేస్తాయి. వాల్ నట్స్‌లో ప్రోటీన్ల కూడా సమృద్ధిగానే ఉంటాయి. ఇవి శరీర కణజాలాన్ని పునర్నిర్మించేందుకు సహాయ పడతాయి. కణజాలం మరమ్మత్తులకు గురై ఆరోగ్యంగా ఉంటుంది. కణజాలం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ వాల్ నట్స్‌ను తీసుకోవాలి. వాల్ నట్స్‌లో ఫైబర్ కూడా అధికంగానే ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. దీంతో బరువు కూడా నియంత్రణలో ఉంటుంది. అధిక బరువును సులభంగా తగ్గించుకోవచ్చు. కొవ్వు కరుగుతుంది. ముఖ్యంగా పొట్ట దగ్గర ఉన్న కొవ్వు తొలగిపోతుంది.

చర్మ సంరక్షణకు..: వాల్ నట్స్‌లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. వీటిల్లో విటమిన్ ఇ ఎక్కువగా ఉంటుంది. ఇది యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటుంది. అందువల్ల ఫ్రీ ర్యాడికల్స్ నిర్మూలించబడతాయి. దీంతో కణాలు డ్యామేజ్ అవకుండా



ఆరోగ్యంగా ఉంటాయి. వాల్ నట్స్‌ను తింటే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. చర్మం కాంతివంతంగా మారి తేమగా ఉంటుంది. మృదువుగా మారుతుంది. ఎల్లప్పుడూ యవ్వనంగా కనిపిస్తారు. వృద్ధాప్య ఛాయలు దరిచేరవు. ముఖంపై ఉండే ముడతలు, మచ్చలు పోతాయి. వాల్ నట్స్‌లో ఫోలేట్ (విటమిన్ బి9) అధికంగా ఉంటుంది. ఇది డీఎన్ఏ ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది. ఎర్ర రక్త కణాలు తయారయ్యేందుకు దోహదం చేస్తుంది. కనుక వాల్ నట్స్‌ను గర్భిణీలు తింటే శిశువులకు కూడా ఎంతో మేలు జరుగుతుంది. వారిలో పుట్టుక లోపం రాకుండా చూడవచ్చు.

కండరాల పనితీరుకు..: వాల్ నట్స్‌లో మెగ్నిషియం అధికంగా ఉంటుంది. ఇది కండరాల పనితీరును మెరుగు పరుస్తుంది. కండరాల నొప్పులను తగ్గిస్తుంది. నాడీ మండల వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయి. రాత్రి పూట కాలి పిక్కలు పట్టుకుపోయే సమస్య ఉన్నవారు రోజూ వాల్ నట్స్‌ను తింటుంటే ప్రయోజనం ఉంటుంది. అలాగే వాల్ నట్స్‌లో ఉండే మెగ్నిషియం ఒత్తిడి, ఆందోళనను తగ్గిస్తుంది. దీని వల్ల మైండ్ రిలాక్స్ అయి రాత్రి పూట చక్కగా నిద్ర పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. వాల్ నట్స్‌లో అధికంగా ఉండే ఫాస్ఫరస్ ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతుంది. వాల్ నట్స్‌ను రోజూ తినడం వల్ల వృద్ధాప్యంలో ఆస్టియోపోరోసిస్, ఆర్థరైటిస్ వంటి ఎముకల సంబంధిత సమస్యలు రాకుండా చూసుకోవచ్చు. ఇలా వాల్ నట్స్‌ను రోజూ తింటే అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

# అందానికి ఆహారం



వేసవిలో అందాన్ని కాపాడుకోవడం.. కొంచెం కష్టంగానే ఉంటుంది. ముఖ్యంగా చర్మం ఆరోగ్యంగా ఉండాలంటే.. అదనపు జాగ్రత్తలు తీసుకోవాల్సి వస్తుంది. అయితే, బయటినుంచి ఎన్ని క్రీములు రాసినా, ఎంత మెరుగులు దిద్దినా మండే ఎండల్లో వ్యర్థమే అవుతుంది. సరైన ఆహారం తీసుకున్నప్పుడే.. వన్నె తగ్గని అందం సొంతమవుతుంది. ఈ క్రమంలో చర్మ సంరక్షణలో కొన్ని ముఖ్యమైన అంశాలను అందించే ఆహారాన్ని తీసుకోవాలని సౌందర్య నిపుణులు చెబుతున్నారు. హైడ్రేషన్: వేసవిలో చర్మం హైడ్రేటెడ్‌గా ఉండాలంటే.. అవకాడో, పుచ్చకాయలు, దోసకాయలు, స్వీట్ పొటాటో, టమాటా, గ్రీన్ టీ.. తీసుకోవడం మంచిది. అవకాడోలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్లు, విటమిన్లు.. శరీరానికి మరింత శక్తినిస్తాయి. ఇందులోని యాంటి ఏజింగ్ లక్షణాలు.. చర్మం ముడతలు పడకుండా కాపాడతాయి. స్వీట్ పొటాటో.. నేచురల్ సన్‌బ్లాక్‌గా పనిచేస్తుంది. చర్మాన్ని కాంతిమంతంగా మారుస్తుంది. ఇందులో అధిక మొత్తంలో లభించే బీటా కెరోటిన్.. చర్మ ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుంది. పుచ్చకాయలు, దోసకాయలు అధిక శాతం నీటితో నిండి ఉంటాయి. ఇవి చర్మాన్ని హైడ్రేట్ చేయడంతోపాటు ఇన్‌ఫ్లమేషన్, చికాకును తగ్గిస్తాయి. వడదెబ్బ వల్ల కలిగే నొప్పిని నివారిస్తాయి. విటమిన్లు: వేసవిలో దెబ్బతిన్న చర్మం మళ్లీ మెరుగ్గా మారాలంటే.. ఆహారంలో విటమిన్లు అధికంగా ఉండేలా చూసుకోవాలి. కొలాజెన్ ఉత్పత్తి కోసం ఆహారంలో విటమిన్ సి ఉండాలి.నారింజ, నిమ్మకాయలు, ద్రాక్షపండ్లలో విటమిన్ సి పుష్కలంగా లభిస్తుంది. క్యారెట్లలో బీటా కెరోటిన్ అధికంగా ఉంటుంది. ఇది చర్మంపై ముడతలు, గీతలు తగ్గించడంతోపాటు చర్మ ఆరోగ్యాన్ని కాపాడటంలో ముందుంటుంది. కేల్ ఆకుకూర.. వేసవిలో అనేక ప్రయోజనాలను అందిస్తుంది. ఇందులోని విటమిన్ ఎ.. చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. దీన్ని సలాడ్, సూప్‌లో తీసుకోవడం ద్వారా.. ఇందులోని విటమిన్లన్నిటినీ శరీరానికి అందించవచ్చు. ఇక గ్రీన్ టీలో ఉండే శక్తిమంతమైన ఫ్లేవనాయిడ్స్.. చర్మాన్ని ఫ్రీరాడికల్స్ నుంచి రక్షిస్తాయి. చర్మం ఎక్కువగా సాగకుండా నిరోధించడంతోపాటు ముడతలు పడకుండా చూస్తాయి. ఉల్లి వెల్లుల్లి కలిపి తింటే..వంటింట్లో ఉల్లి, వెల్లుల్లి తప్పనిసరిగా ఉంటాయి. దాదాపుగా అన్ని రకాల ఆహారాల్లో వీటిని వాడుతూ ఉంటారు.

# ఉల్లి, వెల్లుల్లి కలిపితింటే!

ఏం జరుగుతుంది? ఏమైనా సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయా? దీనికి నిపుణులు చెబుతున్న సమాధానాలు ఇవిగో%ొ%రెండిట్లో పోషకాలు: ఉల్లి, వెల్లుల్లి కలిపి తినడం ఆరోగ్యానికి మంచిది. రెండిట్లోనూ యాంటి ఫంగల్, యాంటి బ్యాక్టీరియల్, యాంటి వైరల్ గుణాలు ఉంటాయి. కాబట్టి, వీటిని కలిపి తీసుకోవడం వల్ల మన రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. పదేపదే జబ్బు పడకుండా ఉంటాం. మైగ్రెయిన్ నుంచి ఉపశమనం: అధిక రక్తపోటు (హైపర్ టెన్షన్) ఉన్నవాళ్లు ఉల్లి, వెల్లుల్లిని కలిపి తినాలి. ఇలా చేస్తే కొంతకాలానికి ఈ సమస్య నుంచి విముక్తి లభిస్తుందంటున్నారు నిపుణులు. అంతేకాదు, పార్శ్వపు నొప్పి (మైగ్రెయిన్)తో బాధపడుతున్న వారికి కూడా ఈ రెండు మంచి ఔషధాలుగా పనిచేస్తాయి. అయితే, ఇలా కలిపి తినడానికి ముందు డాక్టర్ సలహా తీసుకుని ఆచరించడం మంచిది. కొలెస్ట్రాల్‌కు బై బై: శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయులు పెరిగినప్పుడు కూడా ఉల్లి,



వెల్లుల్లి కలిపి తినడం మంచిది. ఇవి కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుతాయి. శరీరంలో కొవ్వు పేరుకుపోకుండా చేస్తాయి. ఉల్లి, వెల్లుల్లిలో విటమిన్ బి, సి, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి.

# తిప్పతీగ రసంలో పసుపు కలిపి తాగితే ఎన్ని లాభాలు ఉంటాయో తెలుసా..?





ఆయుర్వేదంలో ఎన్నో రకాల మూలికలు, మొక్కలు మనకు అందుబాటులో ఉన్నాయి. కొన్ని రకాల మొక్కలు మన ఇంటి చుట్టూ పరిసర ప్రాంతాల్లోనే పెరుగుతాయి. కానీ అలాంటి ఔషధ మొక్కల గురించి చాలా మందికి తెలియదు. వాటిల్లో తిప్పతీగ కూడా ఒకటి. తిప్ప తీగ కాండం లావుగా ఉంటుంది.

దీన్ని చాలా సులభంగా గుర్తించవచ్చు. ఈ మొక్క తీగ జాతికి చెందినది. మన ఇంటి చుట్టూ పరిసర ప్రాంతాల్లోనే పెరుగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో తిప్పతీగ మనకు ఎక్కువగా కనిపిస్తుంది. తిప్ప తీగ ఆకుల నుంచి రసం తీసి తాగవచ్చు. ఈ రసంలో కాస్త పసుపు కలిపి తీసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని ఆయుర్వేదం చెబుతోంది. తిప్పతీగ అనేక వ్యాధులను నయం చేస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

రోగ నిరోధక వ్యవస్థకు..: తిప్పతీగ రసాన్ని ఒక టీస్పూన్ మోతాదులో తీసుకుని దాన్ని ఒక కప్పు నీటిలో కలపాలి. అందులోనే కాస్త పసుపు, మిరియాల పొడి, దాల్చినచెక్క పొడి వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని రోజూ ఉదయం పరగడుపున తాగాలి. ఈ పదార్థాలు కొందరిలో అలర్జీలను కలిగించవచ్చు. కనుక అలర్జీ సమస్య ఉన్నవారు ఈ మిశ్రమాన్ని తాగకూడదు. ఈ విధంగా తయారు చేసిన తిప్పతీగ మిశ్రమాన్ని తాగితే అనేక లాభాలు కలుగుతాయి. ఈ మిశ్రమాన్ని సేవించడం వల్ల అనేక ఔషధ గుణాలు లభిస్తాయి. అనేక రోగాలను తగ్గించుకోవచ్చు. దీంతో రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా


### అనేక వ్యాధులు నయమవుతాయి..!

మారుతుంది. రోగ నిరోధక శక్తి పెరిగి శరీరం వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది. ఎలాంటి రోగం అయినా సరే తగ్గిపోతుంది.

కీళ్లు, మోకాళ్ల నొప్పులకు..: తిప్పతీగ మిశ్రమంలో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి శరీరంలోని వాపులు, నొప్పులను తగ్గిస్తాయి. దీంతో ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. కీళ్ల నొప్పులు, వాపుల సమస్యతో బాధపడుతున్నవారు రోజూ ఈ మిశ్రమాన్ని తాగితే ఫలితం ఉంటుంది. ఎముకలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే మోకాళ్ల నొప్పుల నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. ఈ మిశ్రమాన్ని సేవించడం వల్ల జీర్ణక్రియ మెరుగు పడుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ముఖ్యంగా గ్యాస్, కడుపు ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలు ఉండవు. అలాగే కడుపులో మంట నుంచి ఉపశమనం లభిస్తుంది. జీర్ణ సమస్యలు ఉన్నవారు ఈ మిశ్రమాన్ని సేవిస్తుంటే ఎంతో ఫలితం ఉంటుంది.

దయాబెటిస్ అదుపులో..: తిప్పతీగలో షుగర్‌ను తగ్గించే గుణాలు ఉంటాయి. అలాగే ఈ మిశ్రమంలో కలిపిన అన్ని పదార్థాలు కూడా షుగర్‌ను గణనీయంగా తగ్గిస్తాయి. కనుక డయాబెటిస్ ఉన్నవారు ఈ మిశ్రమాన్ని రోజూ సేవిస్తుంటే షుగర్‌ను కంట్రోల్ చేయవచ్చు. దీంతో డయాబెటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. తిప్పతీగ, పసుపులో యాంటీ బ్యాక్టీరియల్,
యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. కనుక ఈ మిశ్రమాన్ని సేవిస్తుంటే మొటిమలు, వాపులు తగ్గుతాయి. ముఖంపై ముడతలు, మచ్చలు తగ్గిపోతాయి. చర్మం కాంతివంతంగా మారుతుంది. యవ్వనంగా కనిపిస్తుంది. చర్మం మృదువుగా కూడా ఉంటుంది. ఈ మిశ్రమం ఆరోగ్యకరమైనదే అయినప్పటికీ మీరు ఏదైనా వ్యాధికి మందులను వాడుతుంటే ఆయుర్వేద వైద్యులను సంప్రదించి దీన్ని వాడడం ఉత్తమం. లేదంటే సైడ్ ఎఫెక్ట్స్ వచ్చే అవకాశం ఉంటుంది.

# సోప్ నెయిల్స్ చూశారా?!



నో మేకప్ లుక్ ఇప్పుడు ట్రెండింగ్. ఇంతకు మునుపులా లేయర్లు లేయర్లు మేకప్ వేసుకుని హీరోయిన్‌లా కనిపించాలన్న ట్రెండు పోయి, హీరోయిన్లు కూడా మేకప్ లేకుండా కనిపించాలనుకునే రోజులు వచ్చాయి. మనిషి ఎంత నేచురల్‌గా కనిపిస్తే అంత అందం అన్నట్టు భావిస్తున్నారిప్పుడు. గోళ్ల విషయంలోనూ అచ్చం అదే పోకడ వచ్చింది. 'సోప్ నెయిల్స్' ఫ్యాషన్ మనకు ఆ విషయాన్నే చెబుతుంది. చూడగానే లేతగులాబీ రంగులో,తెల్లగా, ఆరోగ్యంగా, అప్పుడే మెనిక్యూర్ చేసిన గోళ్లలా శుభ్రంగా కనిపించడం వీటి ప్రత్యేకత. ఇందుకోసం లేత రంగుల్లో (న్యూడ్‌షేడ్స్) ఉండే మ్యాటీ ఫినిష్ గోళ్ల రంగుల్ని ఎంచుకుంటున్నారు. పైన గాజులా కనిపించాలనుకుంటే గ్లాసీ ఫినిష్ కోట్‌కు ఓటువేస్తున్నారు.కొంతమంది సబ్బు నురగల్ని పోలినట్టు లైట్‌గా కోట్‌నువేస్తున్నారు. ఫేక్‌నెయిల్స్ అదేనండీ ఆర్టిఫీషియల్ గోళ్లు పెట్టుకున్నా వాటిని ఇలాగే సింపుల్‌గా కనిపించేలా ముస్తాబు చేస్తున్నారు. ఫ్యాషన్‌లేదా సింపుల్ లుక్ ఏదైనా అప్పుడే స్నానంచేసినట్టు శుభ్రంగా కనిపించే ఈ గోళ్లు చక్కగా సరిపోతాయి. ఆరోగ్యమే అసలైన అందం మరి అంటున్నాయన్న మాట ఈ ట్రెండింగ్ సోప్ నెయిల్స్!

# 'బరువెక్కుతున్న' భారత్



భారత్ ఊబకాయుల నిలయంగా మారుతున్నదని లాన్సెట్ నివేదిక హెచ్చరించింది. 2050 నాటికి దేశంలో 45 కోట్ల మంది ఊబకాయులు ఉంటారని అంచనా వేసింది. అదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా సగానికి పైగా వయోజనులు ఊబకాయం బారినపడతారని తేల్చింది. 2021లో చైనా తర్వాత భారత్‌లోనే స్థూలకాయులు ఎక్కువగా ఉన్నారని తెలిపింది. పిండి పదార్థాలు, తీపి పదార్థాలను తినడం తగ్గించి, ప్రొటీన్లను ఎక్కువగా తీసుకోకపోతే యువత, పిల్లలు స్థూలకాయం బారిన పడే ప్రమాదం మరింత పెరుగుతుందని హెచ్చరించింది.

### ట్రేడింగ్‌లో మెళకువలంటూ..

# 1.36 కోట్లు కొట్టేశారు



హైదరాబాద్: ట్రేడింగ్‌లో మెళకువలు చెబుతామంటూ సైబర్ నేరాల ముఠా ఓ ఐటీ ఉద్యోగిని నుంచి 1.36 కోట్లు దోచుకున్నారు. నగరంలో కమలానగర్‌కు చెందిన ఓ ఐటీ ఉద్యోగిని సెప్టెంబర్ నెలలో ఫేస్‌బుక్‌లో ఒక లింక్‌ను క్లిక్ చేసింది. బీఓబీక్యాప్స్ ఇన్ఫర్మేషన్ లర్నింగ్ గ్రూప్స్(ఎఫ్516) పేరుతో ఉన్న ఒక వాట్సాప్ గ్రూప్‌కు నెంబర్ యాడ్ అయ్యింది. అందులో ఇద్దరు సైబర్ దొంగలు మారు పేర్లతో వేర్వేరుగా మాట్లాడారు. స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయడం ఎలా? ఏ స్టాక్స్ ఎలాంటి లాభాలొస్తాయనే విషయంలో మెళకువలు చెబుతామంటూ యూజర్ ఐడీ ఇచ్చారు. దీంతో బీవోబీక్యాప్స్ క్యూల్‌బి- ఇన్.కామ్ పేరుతో ఉన్న లింక్‌ను పంపించి అందులో ఖాతాను క్రియేట్ చేసుకొని రూ. 2 లక్షలు పెట్టుబడి పెట్టింది. దీంతో కొన్ని లాభాలు వచ్చాయి, అందులో నుంచి వెయ్యి రూపాయలు విత్ డ్రా చేసుకుంది. దీంతో సదరు ఐటీ ఉద్యోగినికి ఇదంతా నమ్మకమైన వ్యవహారమే అనిపించింది. వారం రోజుల తరువాత 'మీకు ట్రూ అల్టా బయో ఎనర్జీ ఐపీఓ ఓపెన్ అయ్యింది, మీరు వెంటనే ఇన్వెస్ట్ చేయండి, అందులో మేం కూడా కొంత ఫండింగ్ చేస్తాం' అంటూ నమ్మించారు. దీంతో రూ. 53.96 లక్షలు, రూ.68 లక్షలు మరోసారి ఇలా రెండు సార్లు ఇన్వెస్ట్ చేసింది. దీంతో స్క్రీన్‌పై రూ. 2 కోట్ల లాభం కన్పించింది. అందులో నుంచి కొంత డబ్బు విత్ డ్రా చేసుకోవడానికి ఆమె ప్రయత్నించింది. తమకు రూ.31 లక్షల కమిషన్ చెల్లించిన తరువాత డబ్బు విత్ డ్రా చేసుకునే అవకాశం కల్పిస్తామని సైబర్‌నేరగాళ్లు సూచించారు. అకౌంట్లో ఉన్న డబ్బులో మినహాయించుకొని తమకు రావాల్సింది ఇవ్వాలంటూ బాధితురాలు కోరగా అందుకు వారు నిరాకరించారు. కాగా అదే సమయంలో జనరల్ అట్లాంటిక్(బీఎఫ్04) అనే స్టాక్ ట్రేడింగ్ గ్రూప్‌లోను బాధితురాలు ఇన్వెస్ట్ చేసింది. రూ. 2 లక్షలు డిపాజిట్ చేయడంతో కొంత లాభం రావడంతో వెంటనే రూ. 34 లక్షలు పెట్టుబడి పెట్టింది. అందులో కొంత డబ్బు విత్ డ్రా చేసుకోగా మరికొంత డబ్బు అందులోనే ఉంది. కాగా రుబికాన్ రిసర్చ్ లిమిటెడ్ ఐపీఓ షేర్స్ ఉన్నాయని వాటిలో పెట్టుబడి పెట్టాలంటూ మరికొంత ఇన్వెస్ట్ చేయిం చారు. ఇక్కడ కూడా తన డబ్బులు విత్ డ్రా చేసుకోవడానికి ప్రయత్ని చడంతో సైబర్‌నేరగాళు నిరాకరించారు. ఇలా రెండు ఫ్లాట్ ఫామ్స్‌పై రూ. 1.55 కోట్లు పెట్టుబడి పెట్టడంతో రూ. 19 లక్షలు బాధితురాలు తిరిగి రాబట్టుకోగా రూ. 1.36 కోట్లు సైబర్‌నేరగాళ్లు కాజేశారు. దీనిపై బాధితురాలు రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# గాడిన పడుతున్న ఐటీ రంగం..

## భారీగా పెరిగిన నియామకాలు

- భారత ఐటీ రంగంలో మళ్లీ పుంజుకున్న నియామకాలు
- గతేడాదితో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో 27 శాతం వృద్ధి
- ఫ్రెషర్ల నియామకాలపై కంపెనీల ప్రత్యేక దృష్టి, 25 శాతం పెరుగుదల
- ఉద్యోగుల జీతాల్లోనూ సగటున 5 శాతం పెరుగుదల నమోదు
- విశాఖపట్నం వంటి చిన్న నగరాల్లోనూ పెరిగిన ఐటీ అవకాశాలు
- ఏఐ, సైబర్ సెక్యూరిటీ నిపుణులకు తీవ్ర కొరత, భారీ డిమాండ్



హైదరాబాద్, : నిన్నమొన్నటి వరకు నిరాశలో ఉన్న భారత ఐటీ రంగానికి కొత్త ఊపు వచ్చింది. ముఖ్యంగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న ఫ్రెషర్లకు ఇది నిజంగా శుభవార్తే. ప్రాజెక్టులు పుంజుకోవడంతో కంపెనీలు మళ్లీ నియామకాల బాట పట్టాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి ఆరు నెలల్లో నియామకాలు ఏకంగా 27 శాతం పెరిగాయని మానవ వనరుల సేవల సంస్థ 'అడెకో ఇండియా' తన నివేదికలో వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి అర్ధభాగంతో పోలిస్తే ఈసారి నియామకాలు గణనీయంగా పెరిగాయి. ముఖ్యంగా ఫ్రెషర్ల నియామకాలపై కంపెనీలు దృష్టి సారించడం సానుకూల పరిణామం. ఫ్రెషర్ల నియామకాలు గత ఏడాదితో పోలిస్తే 25 శాతం పెరిగాయి. అయితే, కంపెనీలు తమ నియామక వ్యూహాన్ని మార్చుకున్నాయి. కేవలం పేరున్న ఇంజనీరింగ్, టెక్నికల్ కళాశాలలకే ప్రాధాన్యం ఇస్తున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ వంటి అధునాతన నైపుణ్యాలు ఉన్నవారికే అవకాశాలు కల్పిస్తున్నాయి. గతంలో మాదిరిగా ఆఫర్ లెటర్ ఇచ్చి శిక్షణ ఇవ్వడం కాకుండా, అవసరమైన నైపుణ్యాలపై కాలేజీల్లోనే శిక్షణ ఇచ్చి ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నాయని అడెకో ఇండియా డైరెక్టర్ సంకేత్ చెంగప్ప వివరించారు. నియామకాలతో పాటు ఉద్యోగుల జీతాల్లోనూ పెరుగుదల కనిపిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో ఐటీ ఉద్యోగుల జీతాలు సగటున 5 శాతం పెరిగాయి. మరోవైపు, ఐటీ, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ వంటి ప్రత్యేక విభాగాల్లో నిపుణుల కొరత తీవ్రంగా ఉంది. ఈ రంగాల్లో 45 నుంచి 50 శాతం వరకు నైపుణ్యం ఉన్నవారి కొరత ఉన్నట్లు పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. గతంలో బెంగళూరు, హైదరాబాద్, పుణె వంటి పెద్ద నగరాలకే పరిమితమైన ఐటీ కంపెనీలు ఇప్పుడు విశాఖపట్నం, ఇండోర్, కోయం బత్తూర్ వంటి ద్వితీయ శ్రేణి నగరాలపైనా దృష్టి సారిస్తున్నాయి. ఈ నగరాల్లో నియామకాలు 7 శాతం పెరిగాయి. అయినప్పటికీ, ఇప్పటికీ ప్రధాన నియామకాలు పెద్ద నగరాల్లోనే జరుగుతున్నాయి. సుమారు 50 ఐటీ కంపెనీల ఆర్థిక ఫలితాల ఆధారంగా ఈ నివేదికను రూపొందించినట్లు అడెకో ఇండియా తెలిపింది.

# క్లౌడ్ స్టోరేజ్ సేఫ్టీ ఎంత

హైదరాబాద్, : నేటి డిజిటల్ యుగంలో, ప్రతి ఒక్కరికీ ఫోటోలు, వీడియోలు, డాక్యుమెంట్లు, యాప్ డేటా పుష్కలంగా ఉంటాయి. అయితే, ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లలో పరిమిత స్టోరేజ్ కారణంగా.. ప్రతిదీ ఒకే చోట నిల్వ చేయడం అసాధ్యం. క్లౌడ్ స్టోరేజ్ ఆధునిక, సురక్షితమైన పరిష్కారంగా ఉద్భవించింది. క్లౌడ్ స్టోరేజ్ అంటే మీ డిజిటల్ ఫైల్‌లను ఇంటర్నెట్ ద్వారా రిమోట్ సర్వర్‌లో నిల్వ చేయడం. దీని అర్థం మీ ఫోటోలు, వీడియోలు మీ ఫోన్ లేదా కంప్యూటర్‌లో కాకుండా కంపెనీ డేటా సెంటర్‌లో నిల్వ చేయడం. ఈ డేటా సెంటర్ వేలకొద్దీ శక్తివంతమైన కంప్యూటర్లు, సర్వర్‌లతో రూపొందించడం జరిగింది. ఇవి మీ డేటాను సురక్షితంగా ఉంచుతూ 24 గంటలూ పనిచేస్తాయి.మీరు గూగల్ డ్రైవ్, ఐక్లౌడ్, డ్రాప్ బాక్స్ వంటి క్లౌడ్ సేవను ఉపయోగించినప్పుడు, మీ ఫైల్ ఇంటర్నెట్ ద్వారా ఆ కంపెనీ సర్వర్‌లకు వెళుతుందు. అక్కడ, ఫైల్ చిన్న డేటా బ్లాక్‌లుగా విభజించబడి బహుళ సర్వర్‌లలో నిల్వ చేయడం జరుగుతుంది. ఒక సర్వర్ సాంకేతిక వైఫల్యాన్ని ఎదుర్కొంటే, మీ డేటాను మరొక సర్వర్ నుండి సులభంగా తిరిగి పొందగలిగేలా ఇది పని చేస్తుంది. దీనిని డేటా రిడెండెన్సీ అంటారు. తరువాత, మీరు అదే ఫైల్‌ను మళ్ళీ తెరిచినప్పుడు, సిస్టమ్ ఈ డేటా బ్లాక్‌లన్నింటినీ కలిపి మీకు పూర్తి ఫైల్‌ను చూపుతుంది. ఈ మొత్తం ప్రక్రియకు కొన్ని సెకన్లు పడుతుంది. మీ ఫైల్ అక్కడే ఉన్నట్లు, క్లౌడ్‌లో సురక్షితంగా ఉన్నట్లు మీకు అనిపిస్తుంది.క్లౌడ్ కంపెనీలు తమ సర్వర్లలో నిల్వ చేసిన డేటాను ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీని ఉపయోగించి రక్షిస్తాయి. దీని అర్థం మీ ఫైల్‌లు కోడెడ్ రూపంలో నిల్వ చేయడం జరుగుతుంది. వీటిని తెలియని వారు చదవలేరు. యాక్సెస్ చేయలేరు. లాగిన్ ఆధారాలు, యాక్సెస్ అనుమతులు ఉన్న వినియోగదారులు మాత్రమే ఫైల్‌లను తెరవగలరు. అదనంగా, కంపెనీలు బహుళ-పొర భద్రత, ఫైర్‌వాల్‌లు, సాధారణ బ్యాకప్ వ్యవస్థలను ఉపయోగించి డేటా హ్యాకింగ్ లేదా నష్టం నుండి రక్షించినట్లు నిర్ధారించుకుంటాయి. వేగవంతమైన, నమ్మదగిన సేవలను అందించడానికి క్లౌడ్ సర్వీస్ ప్రొవైడర్లు ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలలో తమ డేటా సెంటర్లను నిర్మించారు. ఉదాహరణకు, గూగుల్ అమెరికా, సింగపూర్, ఐర్లాండ్, భారతదేశం వంటి దేశాలలో డేటా సెంటర్లను కలిగి ఉంది. అదేవిధంగా, అమెజాన్, మైక్రోసాఫ్ట్ కూడా వారి స్వంత విస్తారమైన సర్వర్ నెట్‌వర్క్‌లను కలిగి ఉన్నాయి. ఇవి 24 గంటలూ డేటాను నిల్వ చేసి నిర్వహిస్తాయి.క్లౌడ్ స్టోరేజ్ అతిపెద్ద ప్రయోజనం ఏమిటంటే మీరు మీ పరికరంలో డేటా స్టోరేజ్ ఖాళీ చేయవలసిన అవసరం లేదు. మీరు మీ ఫైల్‌లను ఎక్కడి నుండైనా యాక్సెస్ చేయవచ్చు. మీరు మీ ఫోన్‌ను పోగొట్టుకున్నా లేదా మీ ల్యాప్‌టాప్ క్రాష్ అయినా, మీ డేటా ఇంటర్నెట్‌లో సురక్షితంగా ఉంటుంది.


# 5 వేల ఎకరాల్లో వక్కసాగు



అనంతపురం, అ: అనంతపురం రైతులు వక్క సాగుతో ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్నారు. ఒక్కసారి నాటితే వందేళ్ల పాటు దిగుబడినిచ్చే ఈ పంటతో ఎకరాకు రూ.4 లక్షల వరకు ఆదాయం పొందుతున్నారు. సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తూ, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జిస్తున్నారు. అనంతపురం జిల్లాలోని పలు మండలాల్లో 5 వేల ఎకరాల్లో వక్క సాగు చేస్తున్నారు. చల్లని వాతావరణ ఈ పంట సాగుకు అనుకూలం అంటున్నారు రైతులు.వ్యవసాయం అంటే ప్రకృతితో జూదం ఆడటం లాంటిదే. వాతావరణం మొదలు వాడే విత్తనాలు, వేసే మందులు ఇలా ప్రతిది పంట దిగుబడి మీద ప్రభావం చూపుతాయి. ఒకవేళ అన్ని కలిసి వస్తే.. మార్కెట్‌లో ధర ఉండదు. అయితే ఈ సమస్య ఎక్కువగా సంప్రదాయ పంటల సాగు విషయంలోనే ఎదురవుతుంది. అలా కాకుండా కాస్త భిన్నంగా ఆలోచించి... ఇతర పంటల సాగు మీద రైతులు దృష్టి సారిస్తే.. పెట్టుబడి ఖర్చులు కలిసి రావడం మాత్రమేకాకఏళ్ల తరబడి ఆదాయం పొందేందుకు కూడా అవకాశం ఉంటుంది. అనంతపురం రైతులు ఇదే మార్గాన్ని అనుసరిస్తున్నారు. ఒక్కసారి సాగు చేస్తే.. వందేళ్ల పాటు దిగుబడి ఇచ్చే పంటల సాగును ఎంచుకున్నారు...ఉమ్మడి అనంతపురం జిల్లా రైతుల జీవితాల్లో వక్క సాగు వెలుగులు నింపు తుంది. జిల్లా వ్యాప్తంగా 5 వేల ఎకరాల్లో వక్క సాగు చేస్తూ మంచి ఆదాయం పొందుతున్నారు పలువురు రైతులు. మరీ ముఖ్యంగా జిల్లాలోని అగళి, అమరాపురం, కుందుర్పి, మడకశిరి, గుడిబండ, కళ్యాణదుర్గం, శెట్టూరు వంటి మండలాల్లో.. దాదాపు 5 వేల ఎకరాల్లో వక్క సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో వక్క సాగుకు అనుకూలమైన వాతావరణం ఉండటమే కాక.. ఈ రైతులు సేంద్రియ పద్ధతుల్లో పంట సాగు చేస్తూ.., తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జిస్తూ.. ఆర్థికంగా ఎదుగుతున్నారు.నీటి వసతి పుష్కలంగా ఉన్న ఏ నేలలో అయినా వక్కనుపండించవచ్చు. ఒక్కసారి ఈ పంటను నాటితే వందేళ్ల వరకు దిగుబడి వస్తుంది. ఎకరాకు400-500 మొక్కలు నాటుకో వచ్చు. రెండేళ్ల వయసున్న మొక్కలను నాటితే కేవలం నాలుగు సంవత్సరాల్లోనే పంట చేతికి వస్తుంది. ఆగస్టు నుంచి జనవరి వరకు మొత్తం 5విడతల్లో పంట కోస్తారు.చల్లటి వాతావరణం వక్క దిగుబడిని పెంచుతుంది అంటున్నారు రైతులు. అందుకే వారు వక్క పంట చుట్టూ..అవిస, బూరమొక్కలను నాటుతున్నారు. దీని వల్ల వాతావర ణం చల్లగా ఉంటుంది. ఇక పంట సాగులో.. పశువుల పేడ, సేంద్రి య ఎరువులువాడితే అదిక దిగుబడివచ్చి.. మంచి లాభాలు వస్తాయంటున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని అగళి, అమరాపురం మండలాల్లో.. 60 నుంచి 100 ఏళ్ల వయసున్న తోటల్లో ఇప్పటికి కూడా దిగుబడి తగ్గలేదని రైతులు చెప్పుకొచ్చారు.వక్క సాగు విషయానికి వస్తే.. ఈ మొక్కలు నాటడానికి ఎకరాకు లక్ష రూపాయల వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. ఇకఆదాయం విషయానికివస్తే.. బయటక బహిరం గ మార్కెట్‌లో క్వింటాల్ వక్క ధర రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు పలుకుతోంది.

ఎకరాకు ఎంత లేదన్నా.. 6-8 క్వింటాళ్ల దిగుబడి వస్తే రూ.4 లక్షలవరకు ఆదాయం వస్తుంది. వక్కతో పాటు మిరియాలు, తమలపాకులు అంతర పంటలుగా సాగు చేస్తే అదనపు ఆదాయం పొందేందుకు అవకాశం ఉంది అంటున్నారు ఈ పంటను సాగు చేస్తున్న రైతులు. వక్కను ప్రాసెస్ చేసిన తర్వాత మిగిలిపోయే గుజ్జును కిలో రూ.150 చొప్పున అమ్ముతున్నారు. వక్క మట్టలతో ప్లేట్లు తయారు చేయడం వల్ల స్థానికులకు ఉపాధి లభిస్తోంది. కనుక రైతులు ఇలాంటి ప్రత్యామ్నాయం పంటల సాగు మీద దృష్టి సారించాలంటున్నారు వ్యవసాయ శాఖ అధికారులు.

# అడ్డూఅదుపులేని బంగారం ధరలు



### తులం ధర మరో మూడువేలు పెరుగుదల

హైదరాబాద్, : దేశీయ విపణిలో బంగారం, వెండి ధరలు మరోసారి భారీగా పెరిగాయి. క్రితం రోజుతో పోలిస్తే పసిడి ధర మంగళశారం దాదాపు రూ.3వేలు పెరిగింది. హైదరాబాద్ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి పుత్తడి ధర రూ.1.34 లక్షలు దాటింది. అటు వెండి ధర కూడా కేజీపై దాదాపు రూ.4వేలు పెరగడం గమనార్హం. హైదరాబాద్‌లో 10 గ్రాముల బంగారం ధర (24 క్యారెట్లు) రూ.1,31,600 పలికింది. ఆ మొత్తం రూ.1,34,500కు చేరింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి ధర రూ.1,21,000గా ఉంది. మరోవైపు కిలో వెండి ధర రూ.1,67,300 పలికింది. నేడు ఆ ధర రూ.1,71,200కు పెరిగింది. గతవారం రూ.1.85 లక్షల వరకు ఎగబాకిన వెండి ధర ఆ తర్వాత కాస్త తగ్గుతూ వచ్చింది. ఇప్పుడు మళ్లీ గిరాకీ పెరగడంతో బంగారం, వెండి ధరలు మరోసారి పరుగులు పెడుతున్నాయి. అంతర్జాతీయ విపణిలో ఔన్సు బంగారం ధర 4,335 డాలర్లు పలుకుతోంది. ఔన్సు వెండి ధర 51 డాలర్ల పైనే ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో అనిశ్చితి, రష్యా ఉక్రెయిన్ యుద్ధం, అమెరికా టారిఫ్‌లు, డాలర్ విలువ తగ్గిపోతుండటం వంటి పరిణామాలతో పసిడిలో పెట్టుబడులకు మదుపర్లు మొగ్గుచూపుతున్నారు. ఈటీఎఫ్ (ఎక్స్ఛేంజీ ట్రేడెడ్ ఫండ్స్)లలో, కమొడిటీస్ ఎక్స్ఛేంజీలో గోల్డ్ ఫ్యూచర్స్‌పై పెట్టుబడులు పెడుతూనే ఉన్నారు. ఇక, పలు దేశాల కేంద్ర బ్యాంకులు భారీగా బంగారాన్ని కొనుగోలు చేస్తుండటం కూడా ధరల పెరుగుదలకు కారణమవుతోందని విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు, రాబోయేది పెళ్లిళ్ల సీజన్. దీంతో బంగారం ధర మరింత పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి.

# రెండు లక్షల మందికి ఉద్యోగాలు

విశాఖపట్టణం, : విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందుకోసం ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కూడా జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం ఒక గిగావాట్ డేటా సెంటర్ ను విశాఖలో గూగుల్ ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా ఐదేళ్లలో లక్ష కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టనుంది. అయితే గూగుల్ కోసం ఏపీ ప్రభుత్వం ఇప్పటికే మూడు ప్రాంతాలను ఎంపిక చేసింది. ముడసర్లోవ, తర్లువాడ, రాంభిల్లి మండలంలోని భూములను గూగుల్ కోసం కేటాయించనున్నారు. ఈ నేపథ్యంలో గూగుల్ ప్రతినిధులు ఆ ఆయా ప్రాంతాలలో పర్యటిస్తున్నారు.విశాఖపట్నంలో గూగుల్ సంస్థ భారీ పెట్టుబడులు పెడుతున్న సంగతి తెలిసిందే. ఐదేళ్లలో సుమారుగా లక్షా 33 వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టేందుకు ఢిల్లీలో ఇటీవల ఏపీ ప్రభుత్వం, గూగుల్ సంస్థ మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం మేరకు గూగుల్ సంస్థ విశాఖలో వేయి మెగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. ఈ నేపథ్యంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కోసంవిశాఖలోస్థల పరిశీలన జరుగుతోంది.గూగుల్ సంస్థ ప్రతినిధులువిశాఖలో పర్యటిస్తున్నారు. అనువైన ప్రాంతం కోసం అన్వేషిస్తున్నారు. గూగుల్ సంస్థ కోసం ఏపీ ప్రభుత్వం తర్లువాడ, ముడసర్లోవ ప్రాంతాలతో పాటుగా అనకాపల్లిలో జిల్లాలోని రాంబిల్లి మండలంలోని భూములను కూడా కేటాయించనుంది. ఈ నేపథ్యంలో గూగుల్ సంస్థ కన్సల్టెంట్లు.. ఏపీ ప్రభుత్వం కేటాయించిన భూములను పరిశీలించారు. విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఇతర రెవెన్యూ అధికారులతో చర్చించారు. గూగుల్‌కు కేటాయించిన భూములలో సర్వే చేపట్టి అనంతరం హద్దులను నిర్దేశించనున్నారు. గూగుల్ కోసం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన భూములలో తొలుత తర్లువాడ వద్ద పనులు ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎందుకంటే ముడసర్లోవ వద్ద గూగుల్ సంస్థ కోసం ఏపీ ప్రభుత్వం కేటాయించే భూములు.. సింహాచలం ఆలయానికి చెందినవి. దీంతో దేవస్థానంతో చర్చించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే రాంబిల్లిలోని భూములు నౌకాదళం కేంద్రానికి సమీపంలో ఉన్నాయి. దీంతో నౌకాదళం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకున్న మీదట.. తర్లువాడ వద్ద భూములు సిద్ధంగా ఉండటంతో అక్కడే తొలుత పనులు ప్రారంభించే ఆలోచనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో అక్కడ పోలీస్ భద్రతను కూడా పెంచారు.త్వరలోనే సర్వే చేపట్టనున్నారు. ఆ తర్వాత ఫెన్సింగ్ నాటే అవకాశాలు ఉన్నాయిమరోవైపు విశాఖపట్నంలో 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటు చేయనున్న గూగుల్ సంస్థ.. ఐదేళ్లలో 15 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనుంది. గూగుల్ పెట్టుబడుల ద్వారా విశాఖపట్నం ఏఐ హబ్‌గా మారుతుందని ప్రభుత్వం చెప్తోంది. మరోవైపు అమెరికా వెలుపల గూగుల్ ఏర్పాటు చేస్తున్న అతిపెద్ద డేటా సెంటర్ కూడా ఇదే కావటం విశేషం. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు ద్వారా ఏపీ రాష్ట్ర స్థూల ఉత్పత్తికి

2028-32 మధ్య కాలంలో ఏటా రూ.10,518 కోట్లు సమకూరుతుందని అంచనా.అలాగే గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు వలన ప్రత్యక్షంగా, పరోక్షంగా 1,88,220 ఉద్యోగాలు వస్తాయని చెప్తున్నారు. మరోవైపు డేటా సెంటర్ వలన ఎక్కువగా ఉద్యోగాలు రావని వైసీపీతో పాటు మరికొందరి వాదన. కేవలం డేటా స్టోరేజీ కోసం మాత్రమే ఉపయోగిస్తారని.. దీనితో లక్షల సంఖ్యలో ఉద్యోగాలు రావటం కష్టమంటున్నారు. అయితే గూగుల్ వంటి ప్రతిష్టాత్మక సంస్థ పెట్టుబడులతో మరిన్ని కంపెనీలు విశాఖకు వచ్చే అవకాశం ఉంటుందని.. ప్రభుత్వం చెప్తోంది.

# రాంపూర్ గ్రామ ప్రతిభకు అంతర్జాతీయ గుర్తింపు..




హుజురాబాద్ : కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన డా. గోసి కొండ శ్రీరాములు అంతర్జాతీయ వేదికపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహించి జిల్లా కీర్తిని ఇనుమడింపజేశారు. వారణాసిలోని ప్రతిష్టాత్మక బనారస్ హిందూ విశ్వవిద్యాలయం (బీహెచ్‌యూ) సోషియాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డా. శ్రీరాములు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ విశ్వవిద్యాలయంలో జరిగిన స్వదేశీ నిర్వహణ మరియు సంస్థాగత అధ్యయనాల అంతర్జాతీయ అకాడమీ కాన్ఫరెన్స్ 2025లో పాల్గొన్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రపంచ సదస్సులో భారతదేశం నుండి పాల్గొన్న ఏకైక పరిశోధకులు డాక్టర్ శ్రీరాములు గోసికొండ కావడం విశేషం. కెనడా, బ్రెజిల్, యునైటెడ్ కింగ్‌డమ్, ఫిన్లాండ్, న్యూజిలాండ్ వంటి వివిధ దేశాల నుండి హాజరైన దాదాపు 60 మంది ప్రతినిధుల సమక్షంలో ఆయన భారతీయ పరిశోధనను సమర్పించారు. డా. శ్రీరాములు "భారతదేశంలో రహస్యంగా జరిగే ఆధిపత్యాన్ని సినిమాగా ప్రదర్శించడం, గిరిజనుల ఉనికి, రాష్ట్రాధికారం, మరియు సాంస్కృతిక సంఘర్షణ మీద ఒక అన్వేషణ" అనే పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. ఈ లోతైన అధ్యయనం ప్రముఖ చిత్రం 'కాంతారా'పై సామాజిక శాస్త్ర దృక్పథాన్ని స్పృశిస్తూ, గిరిజన గుర్తింపు, ప్రభుత్వ అధికారం మరియు సాంస్కృతిక రాజకీయాల సమ్మేళనాన్ని విశ్లేషిస్తుంది. ఆయన అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనడం మన కరీంనగర్ జిల్లాకు గర్వకారణం. స్వదేశీ సంస్థాగత అధ్యయనాలపై జరుగుతున్న ప్రపంచ చర్చలో డా. శ్రీరాములు చేసిన కృషి భారత్‌కు, ప్రత్యేకించి కరీంనగర్ ప్రాంతానికి మరియు బీహెచ్‌యూకు మరింత గౌరవాన్ని తెచ్చిపెట్టింది.

# వన్ టైమ్ ఎంపీగానే గోరంట్ల



అనంతపురం, : మాజీ పార్లమెంటు సభ్యుడు గోరంట్ల మాధవ్ కు ఈసారి కూడా వైసీపీలో టిక్కెట్ దొరకడం కష్టమే. ఆయన అనేక రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ పార్టీ అధికారంలోకి వస్తే రాజ్యసభ లేదా ఎమ్మెల్సీ వంటి నామినేటెడ్ పోస్టు ఇస్తారేమో కానీ ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం మాత్రం ఇక దొరకదన్నది పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. ఆయన వరసగా అనేక వివాదాలలో కూరుకున్నందున, పార్టీకి ఇబ్బందికరంగా మారినందున ఆయనకు ఎక్కడా అసెంబ్లీ, పార్లమెంటు టిక్కెట్ ఇచ్చే అవకాశం లేదని తెలిసింది. గోరంట్ల మాధవ్ కు కూడా ఇటీవల కాలంలో చూచాయగా ఈ విషయాన్ని పార్టీ నాయకత్వం చెప్పినట్లు పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. పోలీస్ శాఖలో సర్కిల్ ఇన్స్పెక్టర్ గా, పోలీస్ అధికారుల సంఘం నేతగా ఉండి, ఉద్యోగానికి స్వచ్ఛంద పదవీ విరమణ చేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. జగన్ హిందూపురంలో బీసీలకు టిక్కెట్ ఇవ్వాలనుకుంటున్న జగన్ కు గోరంట్ల మంచి ఛాయిస్ గా కనిపించారు. దీంతో ఆయనకు ఈ ఎన్నికల్లో హిందూపురం పార్లమెంటు టిక్కెట్ దక్కింది. అన్నీ కలిసొచ్చి విజయం సాధించారు. గెలిచిన తర్వాత అనేక వివాదాల్లో చిక్కుకున్నారు. పార్లమెంటు సభ్యుడిగా మంచి పేరు తెచ్చుకున్నా వ్యక్తిగత విషయాలతో ఆయన ఇబ్బంది పడ్డారు. పార్టీని కూడా ఇబ్బందుల్లోకి నెట్టారు. సామాజికవర్గం కోటాలో తనకు సీటు దక్కుతుందని ఇన్నాళ్లు భావించిన గోరంట్ల మాధవ్ కు మాత్రం ఇక ఆశ నెరవేరనట్లేనని అనుకోవాలి... వైసీపీకి నమ్మకమైన నేతగా గోరంట్ల మాధవ్ ఉన్నప్పటికీ ఆయన పత్తికొండ, రాప్తాడు నియోజకవర్గాలపై కన్నేశారు. కానీ అక్కడ అప్పటికే వైసీపీకి చెందిన బలమైన నేతలున్న కారణంగా వచ్చే ఎన్నికల్లోనూ ఎక్కడా గోరంట్ల మాధవ్ కు సీటు దక్కే అవకాశాలు లేవు. తమ నియోజకవర్గాల్లో వేలు పెడుతున్నారంటూఅక్కడి నేతలు గోరంట్ల మాధవ్ పై వైసీపీ నాయకత్వానికి ఫిర్యాదుచేసినట్లు తెలిసింది. దీంతో వైసీపీ కి చెందిన ముఖ్య నాయకుడు ద్వారా జగన్ గోరంట్లకు సమాచారం పంపారని, ఆ నియోజకవర్గాల్లో వేలు పెట్టవద్దని సూచించినట్లు తెలిసింది. వైసీపీ అధికారంలోకి వస్తే నామినేట్ పదవి మాత్రం ఖచ్చితంగా దక్కుతుంది. అందుకే గోరంట్ల మాధవ్ ఇటీవల కాలంలో సైలెంట్ గా ఉన్నారు.

## తెలుగు రాష్ట్రాల ప్రజలకు గుడ్‌న్యూస్..

# తిరుపతి, షిర్డీ వెళ్లేందుకు ప్రత్యేక రైళ్లు..!



హైదరాబాద్,:తిరుపతి, షిర్డీ వెళ్లే తెలుగు రాష్ట్రాల ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త చెప్పింది. తిరుపతి-షిర్డీ-తిరుపతి, చర్లపల్లి-తిరుపతి-చర్లపల్లి మధ్య ప్రస్తుతం నడుస్తున్న ప్రత్యేక రైళ్లను వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీ వరకు పొడిగిస్తున్నట్లు పేర్కొంది. తిరుపతి-షిర్డీ సాయినగర్ (07637) రైలు నవంబర్ 30 నుంచి డిసెంబర్ 28 వరకు పొడిగిస్తున్నట్లు తెలిపింది. ఈ రైలు ప్రతి వేకువ జామున 4గంటలకు బయలుదేరి.. మరుసటి రోజు ఉదయం 10.45 గంటలకు గమ్యస్థానం చేరుతుంది. షిర్డీ సాయినగర్-తిరుపతి (07638) రైలు డిసెంబర్ ఒకటి నుంచి 29వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపింది. ఈ రైలు ప్రతి సోమవారం రాత్రి 7.45 గంటలకు బయలుదేరి వేకువ జామున 1.30గంటకు తిరుపతికి చేరుతుంది. చర్లపల్లి-తిరుపతి (07001) రైలు డిసెంబర్ 3 నుంచి 31 వరకు ప్రతి నడుస్తుందని తెలిపింది. ఈ రైలు రాత్రి 9.20 గంటలకు చర్లపల్లి నుంచి బయలు దేరి.. మరుసటి రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు తిరుపతి చేరుకుంటుందని పేర్కొంది. తిరుపతి-చర్లపల్లి (07002) రైలు డిసెంబర్ 4 నుంచి జనవరి 1 వరకు రైలు రాకపోకలు సాగిస్తుందని.. ఈ రైలు సాయంత్రం 4.40 గంటలకు బయలుదేరి.. మరుసటిరోజు ఉదయం 8 గంటలకు గమ్యస్థానం చేరుకుంటుందని వివరించింది.

# గ్లోబల్ సిటీగా హైదరాబాద్



హైదరాబాద్, : ప్రపంచంలోని అత్యుత్తమ నగరాల జాబితా 2025-26 ప్రకారం, లండన్ ఈసారి కూడా ప్రపంచంలోని అత్యుత్తమ నగరాల జాబితాలో అగ్రస్థానంలో ఉంది. ఈ జాబితాలో న్యూయార్క్ రెండో స్థానంలో ఉంది. వాస్తవానికి, ప్రతి సంవత్సరం ప్రపంచంలోని అత్యుత్తమ నగరాల జాబితాను తయారు చేస్తారు, ఇందులో నివసించడానికి, తిరగడానికి, పని చేయడానికి ఏ నగరం ఉత్తమమో చూస్తారు. ఈ నివేదికను రెజోనెన్స్ కన్సల్టెన్సీ ఉ ఇప్సోస్ తయారు చేసింది. ఇందులో 10 లక్షలకుపైగా జనాభా కలిగిన 270 కంటే ఎక్కువ నగరాలను మూల్యాంకనం చేస్తారు. దీని తరువాత, ప్లేస్ పవర్ స్కోర్ ఆధారంగా, ప్రపంచంలోని అత్యుత్తమ నగరం ఏంటో తెలుస్తుంది. ఒక నగరాన్ని మంచిది లేదా అత్యుత్తమమైనదిగా ప్రకటించడానికి, దానిని అనేక విధాలుగా పరీక్షిస్తారు. ఈ పాయింట్లలో నగర జీవనశైలి, భద్రత, ఉపాధి అవకాశాలు, విద్య, సంస్కృతి, ఆర్థిక బలం, పర్యావరణం వంటివి ఉన్నాయి. ఈ అన్ని అంశాలను కలిపి ఏ నగరం ఇతరులకన్నా ముందుందో నిర్ణయిస్తారు. ఈ పాయింట్లలో, నగరాన్ని జీవించే సామర్థ్యం ఆధారంగా కూడా చూస్తారు. ఈ పారామీటర్‌లో, నగరం రోజువారీ సౌకర్యాలు, పరిశుభ్రత, ట్రాఫిక్, ఆరోగ్య సేవలు, జీవనశైలి ఖర్చు, మౌలిక సదుపాయాలను కూడా చూస్తారు. ఏదైనా నగరం ఈ అన్ని విషయాల్లో మెరుగ్గా ఉంటే, దాని జీవనయోగ్యత స్కోరు కూడా ఎక్కువగా ఉంటుంది. దీనితోపాటు, జీవించే సామర్థ్యం, ఒక నగరంలో సౌకర్యాలు ఉండటం మాత్రమే సరిపోదు. అక్కడ వాతావరణం ఎలా ఉందో కూడాముఖ్యం. ఈ విభాగంలో సంస్కృతి, వినోదం, సామాజిక వాతావరణం, నైట్‌లైఫ్, ప్రజల సంతృప్తిని చూస్తారు. ఏ నగరాల్లోనైతే శక్తి ,సంస్కృతి ఎక్కువగా ఉంటాయో, అవి ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉంటాయి.ఏదైనా నగరం అసలు బలం దాని ఆర్థిక పరిస్థితి ద్వారా గుర్తిస్తారు. ఉపాధి అవకాశాలు, విద్య స్థాయి, స్టార్టప్‌లు, సంస్కృతి, సాంకేతికత, ఆదాయ మార్గాలు అన్నీ దాని శ్రేయస్సులో భాగం. ఆర్థిక అవకాశాలు ఎక్కువగా ఉన్న నగరాలు ప్రపంచవ్యాప్తంగా మరింత ఆకర్షణీయంగా పరిగణిస్తారు.ఇటీవల విడుదలైన ఈ నివేదికలో లండన్ వరుసగా 11 సార్లు ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా నిలిచింది. దీని తరువాత న్యూయార్క్, పారిస్, టోక్యో, మాడ్రిడ్, సింగపూర్, రోమ్, దుబాయ్ వంటి నగరాలు టాప్ 10లో ఉన్నాయి. భారతదేశం నుంచి కేవలం నాలుగు నగరాలు మాత్రమే ఈ నివేదికలో చేరాయి. ఈ భారతీయ నగరాల్లో బెంగళూరు, ముంబై, ఢిల్లీ, హైదరాబాద్ ఉన్నాయి. వీటిలో హైదరాబాద్ 82వ స్థానంలో ఉంటే బెంగళూరు 29వ స్థానంలో ఉంది. ముంబై 40వ ర్యాంకు, ఢిల్లీ 54వ ర్యాంకు సాధించాయి.

# విశాఖలో స్థలాల కోసం అన్వేషణ!

విశాఖపట్టణం, : 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంతో దూసుకుపోతున్న కూటమి ప్రభుత్వం.. విశాఖలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో రూ. 13.21 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది. ఈ మేరకు వివిధ కంపెనీలతో 613 ఎంవోయూలు కుదుర్చుకుంది. అందులో విశాఖ కేంద్రంగా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు రూ. లక్ష కోట్ల విలువగల 99 ఒప్పందాలు ఉన్నాయి. పెట్టుబడులు పెట్టడానికి ముందుకువచ్చిన కంపెనీలు.. పరిశ్రమల ఏర్పాటు చేసేందుకు భూములు సిద్ధం చేసి, విద్యుత్, నీటి సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది. తమది స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానమంటూ దూసుకెళ్తోంది కూటమి ప్రభుత్వం. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఇటీవల విశాఖలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఆ మేరకు పెట్టుబడులు రాబట్టడంలో విజయం సాధించింది. ఈ సదస్సులో రూ. 13.21 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. మొత్తం 613 ఎంవోయూలు కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఇందులో విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటు కానున్న సంస్థలకు సంబంధించి 99 ఒప్పందాలు ఉన్నాయి. వీటి ద్వారా రూ. 98,917 కోట్లు పెట్టుబడులు రానున్నాయి. అయితే కేవలం అవగాహన ఒప్పందాలతోనే సరిపెట్టకుండా.. వీలైనంత త్వరగా కార్యరూపం దాల్చేలా చర్యలు ప్రారంభించింది.విశాఖలో ఏర్పాటయ్యే పరిశ్రమలకు సంబంధించి కుదిరిన ఎంవోయూలను అమలు చేసేలా ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఈ మేరకు ఇప్పటికే కార్యాచరణ రూపొందించామని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఏపీఈడీబీ) సూచనల మేరకు.. ఆయా పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూ కేటాయింపులు, విద్యుత్తు కనెక్షన్, నీటి సదుపాయాల కల్పన, ఇతర మౌలిక వసతుల ఏర్పాటుకు తర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ మేరకు గురువారం జరిగిన మీడియా సమావేశంలో కలెక్టర్ వెల్లడించారు.పరిశ్రమల ఏర్పాటు కోసం 500 నుంచి 600 ఎకరాల భూములు ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. వీటికి అదనంగా 1200 ఎకరాలను విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్డీఏ) ద్వారా సమీకరించేందుకు ప్రణాళిక చేస్తున్నామని వెల్లడించారు. మరోవైపు, విశాఖ సీఐఐ సదస్సులో కుదిరిన ఒప్పందాల్లో.. అధిక శాతం ఐటీ, టూరిజం, డేటా సెంటర్లకు సంబంధించిన పెట్టుబడులు ఉన్నాయని కలెక్టర్ చెప్పారు. ఇందులో 7 ఐటీ సంస్థలకు ఇప్పటికే భూమి పూజ కార్యక్రమాలు పూర్తి అయినట్లు వెల్లడించారు. కాగా, ఈ మొత్తం పెట్టుబడులు పూర్తి స్థాయిలో కార్యరూపం దాల్చితే.. 2,58,089 మందికి ఉద్యోగాలు లభించే అవకాశం కలుగుతుందని ఆయన చెప్పారు.మరోవైపు, విశాఖ సీఐఐ సదస్సుకు 60 దేశాల నుంచి 4,975 మంది ప్రతినిధులు వచ్చారు. వీరిలో అంతర్జాతీయ ప్రతినిధులు 640 మంది ఉండగా, దేశీయ ప్రతినిధులు 1135 మంది ఉన్నారు. 185 మంది దౌత్యవేత్తలతో పాటు ఎంవోయూల భాగస్వాములు 1,575 మంది సదస్సుకు హాజరయ్యారు. రెండ్రోజుల సదస్సులో 41 సెషన్లు నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 24 ద్వైపాక్షిక సమావేశాల్లో, 16 వ్యాపార సమావేశాల్లో పాల్గొన్నారు.

# గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్

## 150 గ్రాముల డ్రై గంజాయి స్వాధీనం సమాచారం అందించి నేరాల నియంత్రణకు సహకరించాలని ప్రజలకు సీఐ విజ్ఞప్తి




**,మందమర్రి:** గంజాయి అక్రమ రవాణా మరియు విక్రయా లను అరికట్టడంలో భాగంగా, మందమర్రి సర్కిల్ పోలీసులు చేపట్టిన ప్రత్యేక నిఘాలో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 150 గ్రాముల డ్రై గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మందమర్రి ఎస్ఐ ఎస్. రాజశేఖర్ మరియు రామకృష్ణాపూర్ పోలీస్ సిబ్బందితో కూడిన బృందం ఈరోజు ఉదయం 10:00 గంటల ప్రాంతంలో సర్కిల్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, రామకృష్ణాపూర్ సమీపంలోని ఎస్.సి.సి.ఎల్. ఏరియా ఆసుపత్రి వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వీరిని అదుపులోకి తీసుకుని విచారించగా, వారు 1. గంగాధరి పృధ్వితేజ (వయస్సు 20, ఐటీఐ విద్యార్థి, రామ కృష్ణాపూర్) మరియు 2. ఎస్.కె. గౌసియా (వయస్సు 35, కూలీ, మంచిర్యాల) గా గుర్తించారు.పృధ్వితేజ వద్ద నుంచి 150 గ్రాముల డ్రై గంజాయి ప్యాకెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం జరిపిన విచారణలో, నిందితురాలు ఎస్.కె. గౌసియా మహారాష్ట్రలోని బల్లార్షా రైల్వే స్టేషన్ వద్ద గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి, ఇక్కడ పృధ్వితేజకు విక్రయిస్తున్నట్లు ఒప్పుకుంది. పృధ్వితేజ ఆ గంజాయిని యువతకు అమ్ముతున్నట్లు వెల్లడైంది. నిందితుల వద్ద నుంచి గంజాయితో పాటు, విక్రయానికి సంబంధించిన రూ. 1,500/- నగదును, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మందమర్రి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ, యువత భవిష్యత్తును నాశనం చేసే గంజాయి, డ్రగ్స్ విక్రయాలపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని స్పష్టం చేశారు. ఎవరైనా గంజాయి కొనుగోలు చేసినా, విక్రయించినా చట్టపరమైన తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రజలకు విజ్ఞప్తి: "గంజాయి మరియు ఇతర మాదక ద్రవ్యాల కొనుగోలు, అమ్మకాలు లేదా రవాణాకు సంబంధించిన సమాచారం ఏమైనా తెలిస్తే, వెంటనే పోలీసులకు తెలియజేయగలరు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయి. మాదక ద్రవ్యాల రహిత సమాజం కోసం ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరుతున్నాము.

# క్రెడిట్ కార్డులు వరమా? శాపమా?

## అప్పుల ఊబిని తప్పించే మార్గాలేవి!



దుర్వినియోగం చేస్తే క్రెడిట్ కార్డులు అప్పుల ఊబిలోకి లాగేస్తాయి. కానీ క్రమశిక్షణతో వాడుతూ.. పూర్తిస్థాయిలో చెల్లింపులు జరిపి, ఖర్చులను అదుపులో పెడితే మీ రుణపరపతిని అమాంతం పెంచేస్తాయి. అధిక వడ్డీరేట్లు, ఆర్థిక ఒత్తిళ్లనూ అధిగమించవచ్చు. ఇంతకీ క్రెడిట్ కార్డులు.. వినియోగదారులపట్ల వరమా..? శాప మా..? రుణాల ఉచ్చు నుంచి తప్పించుకోవడానికున్న మార్గాలేవి? దేశంలో క్రెడిట్ కార్డుల వినియోగం పెద్ద ఎత్తున పెరిగిపోయింది. గత కొన్నేండ్లలో క్రెడిట్ కార్డు యూజర్ల సంఖ్య జెట్ స్పీడ్‌తో పెరిగిపోయిందంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. మార్కెట్‌లో సులభంగానే క్రెడిట్ కార్డులు లభిస్తుండటం, ఆకర్షణీయ ఆఫర్లు, పెరిగిన వినిమయ శక్తి.. ఇవన్నీ కూడా ఇందుకు కారణమే. అయితే మితిమీరుతున్న క్రెడిట్ కార్డుల వినియోగం.. కార్డుదారులు, గృహస్తులను అప్పుల ఊబిలోకి లాగుతున్నదన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయిప్పుడు. కానీ రుణ సాధనాలను వాడుతున్నప్పుడు క్రెడిట్ కార్డు వినియోగదారులు ఎలా ఉంటున్నారు? మరెలా ఆలోచిస్తున్నారు? అన్నది ఇక్కడ ప్రశ్న. మరి దీనిపై ఆర్థిక నిపుణులు ఏమంటున్నారు?

ఇదీ సంగతి..: అధిక వడ్డీరేట్లు క్రెడిట్ కార్డు వినియోగదారులను అప్పుల ఊబిలో పడేస్తున్నాయి. దేశంలో ప్రస్తుతం వాడకంలో ఉన్న చాలా క్రెడిట్ కార్డులపై యూజర్లు గడువులోగా బకాయిలను చెల్లించకపోతే గరిష్ఠంగా 30 నుంచి 42 శాతం చార్జీలు పడుతున్నాయి. చిన్నచిన్న బకాయిలపైనా వడ్డీ భారం తడిసి మోపెడవుతున్నది. ఇక ఎడాపెడా ఖర్చులు చేసి, ఆపై మొత్తం బకాయిలను చెల్లించకుండా చాలామంది మినిమం పేమెంట్స్‌తోనే సరిపెడుతున్నారిప్పుడు. దీనివల్ల కార్డును అప్పటికప్పుడు యాక్టివ్‌గా ఉంచుకుంటున్నా.. దీర్ఘకాలంలో మాత్రం యూజర్లు అప్పుల ఊబిలో పడే ప్రమాదం ఏర్పడుతున్నది. 'ఇప్పుడు వాడుకోండి.. ఆ తర్వాత చెల్లించండి', 'సులభ వాయిదాల్లో పేమెంట్స్ చేయండి'.. ఇలా రకరకాల ఆఫర్లు క్రెడిట్ కార్డు యూజర్లను అవసరం లేకపోయినా ఖర్చులకు ప్రేరేపిస్తున్నాయి. ఫలితంగా చివరకు డిఫాల్టర్లుగా మిగిలిపోతున్నవారెందరో.

ఇవే సమస్యలు: క్రెడిట్ కార్డు వినియోగదారుల్లో చాలామందికి ఆర్థిక క్రమశిక్షణ అంతంతమాత్రంగానే ఉంటున్నది. బకాయిలను ఎప్పటికప్పుడు క్లియర్ చేయకుండా.. తదుపరి నెలల్లోకి తీసుకెళ్లడం వారిపై రుణ భారాన్ని పెంచేస్తున్నది. నిజానికి క్రెడిట్ కార్డు రుణ నిర్వహణ అనేది చాలా కీలకం. ప్రభావవంతంగా, వివేకంతో వినియోగిస్తేనే లాభదాయకం. బ్యాంకులు ఇస్తున్నాయి కదా.. అని చాలామంది అనేక కార్డులను తీసుకుంటున్నారు. దీనివల్ల రీపేమెంట్లు అస్తవ్యస్తంగా తయారవుతున్నాయి. క్రెడిట్ కార్డులతో ఏటీఎంల్లో నగదు ఉపసంహరణలు చేస్తున్నారు. అయితే ఈ లావాదేవీలకు అధిక ఫీజులుంటాయి. మొదటి రోజు నుంచే చార్జీలు వర్తిస్తాయి. తెలియకుండానే భారం పడుతుంది.

ఇలా చేయండి..: క్రెడిట్ కార్డు బకాయిలను క్లియర్ చేయడానికి నెలవారీ రీ-పేమెంట్ రూల్‌ను పెట్టుకోండి. మినిమం బ్యాలెన్స్‌లు కాకుండా పూర్తిస్థాయిలో బకాయిలను చెల్లించండి.

క్రెడిట్ లిమిట్‌ను మీ ఖర్చులకున్న పరిమితిగా భావిస్తే అనవసరపు వ్యయాలను దూరం పెట్టవచ్చు. ఖర్చులను తెలుసుకోవడానికి డిజిటల్ యాప్‌లు, స్టేట్‌మెంట్లను వాడండి. రివార్డులను రిడీమ్ చేసుకోండి. కానీ వాటిని వాడుకోవద్దు.

క్రెడిట్ కార్డులను అజాగ్రత్తగా వాడితే అప్పుల కుప్పే. క్రమశిక్షణతో వినియోగిస్తేనే సత్ఫలితాలుంటాయి. అందుకే క్రెడిట్ కార్డును ఓ స్వల్పకాలిక రుణంగా భావించాలి. కొనుగోళ్లు, ఖర్చులపై అవగాహన ఉండాలి. బకాయిలను పూర్తిగా చెల్లిస్తే రుణ పరపతి పెరుగుతుంది. ఇస్తున్నారుకదా అని ప్రతీ కార్డునూ తీసుకోవద్దు. రెండుకు మించి క్రెడిట్ కార్డులుంటే రుణ భారమే. కార్డుకున్న రుణ పరిమితిని పూర్తిగా వాడుకోవద్దు. 70 శాతం మించి వాడకపోవడమే మంచిది.

# కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

## -ఐఎన్టియుసి కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతి యాదవ్



కమాన్ పూర్: కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఐఎన్టియుసి అధ్యక్షులు సంజీవరెడ్డి, సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ గార్ల ఆదేశాల మేరకు జరగనున్న కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల సంయుక్త కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా ఓసీ1లో నల్ల బ్యాడ్జీలను ధరిస్తూ ఉద్యోగులందరూ నిరసన తెలిపాలని,

ఈ కార్యక్రమంలో అన్ని కార్మిక సంఘాల జేఏసీ మద్దతు ఇవ్వాలని పిలుపునిస్తూ, కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం వెంటనే కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను రద్దు చేయాలనీ ఓసి1 సైట్ ఆఫీసులో ఐఎన్టియుసి కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతి యాదవ్ కార్మికులతో సమావేశములో మాట్లాడారు. కార్మికుల హక్కుల రక్షణకు అందరూ కలిసి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సలీం, రమేష్, రాంచం దర్ రావు, కొండల్ రెడ్డి, వెంకన్న, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# పదవుల పందరానికి సిద్ధం

కాకినాడ, : తెలుగుదేశం పార్టీ కూటమిలో చాలామంది నేతలు ఇంకా పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. వారి విషయంలో చంద్రబాబు ఎటువంటి నిర్ణయం తీసుకోవడం లేదు. రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవుల వరకు చాలామంది నేతలకు ఓకే చేశారు. అయితే వాటికి మించిన స్థాయి పదవులు ఆశిస్తున్న వారి విషయంలో మాత్రం ఎదురుచూపులు తప్పడం లేదు. ఎందుకంటే పెద్ద పెద్ద పెదవులు భర్తీ చేయడానికి ఆ సమయం రావాలి. ముఖ్యంగా రాజ్యసభ తో పాటు ఎమ్మెల్సీ పదవులను ఖాళీ అయినప్పుడు మాత్రమే భర్తీ చేయాల్సి ఉంటుంది. అయితే 2026లో భారీ స్థాయిలో ఎమ్మెల్సీలతో పాటు రాజ్యసభ ఖాళీలు ఏర్పడతాయి. తప్పకుండా అప్పుడు నేతలను సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. అయితే గత ఎన్నికల్లో టిక్కెట్లు త్యాగం చేసిన వారు, పార్టీకి ప్రచారం చేసిన వారు, పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లినవారు పదవులు ఆశిస్తున్నారు. వారికి ఒక క్రమ పద్ధతిలో పదవులు ఇవ్వాల్సిన అవసరం ఉంది.సీనియర్ నేతల్లో ప్రధానంగా యనమల రామకృష్ణుడు, కేఈ కృష్ణమూర్తి, దేవినేని ఉమామహేశ్వరరావు, రాజేంద్రప్రసాద్, వంగవీటి రాధాకృష్ణ, పిఠాపురం వర్మ, బుద్ధ వెంకన్న వంటి నేతలకు సర్దుబాటు చేయాల్సి ఉంది. ఇప్పటికే అశోక్ గజపతి రాజుకు లైన్ క్లియర్ చేశారు. ఆయన హోదాకు తగ్గట్టు గవర్నర్ పదవి ఇప్పించారు. ఇప్పుడు యనమల రామకృష్ణుడు కు ఏదో ఒక పదవి ఇవ్వాల్సిన అవసరం ఉంది. అయితే ఆయన రాజ్యసభ పదవి కోరుకుంటున్నారు. ఒకసారి పెద్దల సభలో అడుగు పెట్టాలని భావిస్తున్నారు. అంటే ఈ ఏడాదిలో ఆయనకు ఛాన్స్ వచ్చినట్టే. మరోవైపు దేవినేని ఉమామహేశ్వరరావుకు సర్దుబాటు చేయాల్సిన అవసరం ఉంది. ఆయన వైసీపీ నుంచి వచ్చిన వసంత కృష్ణ ప్రసాద్ కోసం మైలవరం టికెట్ ను వదులుకున్నారు. తప్పనిసరిగా ఆయనకు ఎమ్మెల్సీ కానీ.. రాజ్యసభ కానీ ఇవ్వాల్సిన అవసరం ఉంది. రాజేంద్రప్రసాద్ సైతం పార్టీ వాయిస్ ను గట్టిగానే వినిపించారు. స్థానిక సంస్థల్లో తెలుగుదేశం పార్టీని సజీవంగా నిలబెట్టారు. రాజేంద్రప్రసాద్ తో పాటు బుద్ధ వెంకన్న లాంటి నేతలు 2014లో ఎమ్మెల్సీ పదవులు అందుకున్నారు. వారికి ఇప్పుడు అవే పదవులు ఇవ్వాల్సి ఉంది. వంగవీటి రాధాకృష్ణతోపాటు పిఠాపురం వర్మ పార్టీ కోసం త్యాగాలు చేయడమే కాదు.. కూటమి పార్టీలకు మద్దతుగా ప్రచారం చేశారు.వారికి సైతం ఎమ్మెల్సీ పదవులు సర్దుబాటు చేయాల్సి ఉంది.ఇప్పటివరకు రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవుల ఎంపిక జరిగిం ది. మూడు పార్టీలకు ప్రాధాన్యం దక్కింది. నేతలు నేతలు వారి స్థాయి బట్టి పదవులు కేటాయించారు. అయితే ఇప్పుడున్న మిగిలిన నేతలు అంతా రాజ్యసభ తో పాటు ఎమ్మెల్సీ పదవులు ఆశిస్తున్నవారే. ప్రస్తుతం 30 మందికి పైగా వైసీపీ ఎమ్మెల్సీలు శాసనమండలిలో ఉన్నారు. ఏడు రాజ్యసభ సీట్లు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఉన్నాయి. ప్రాధాన్యత క్రమంలో 2028 వరకు ఇవన్నీ ఖాళీ కానున్నాయి. ఇప్పటికే ఓ ఐదు ఆరుగురు ఎమ్మెల్సీలు రాజీనామా చేశారు. కానీ చైర్మన్ ఆమోదించలేదు. అయితే పదవీ విరమణ చెందిన వారి స్థానంలో తప్పకుండా కూటమికి లభిస్తాయి. వచ్చే ఏడాది ఓ మూడు రాజ్యసభ స్థానాలతో పాటు10 వరకు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అయ్యే అవకాశం ఉంది. అదే జరిగితే మొత్తం ఖాళీల భర్తీ జరగనుంది. వెయిటింగ్ లిస్టులో ఉన్న టిడిపి నేతలకు పదవులు లభిస్తాయి. ఆపై 13 జిల్లాల జిల్లా పరిషత్ చైర్మన్ పోస్టులు సైతం కొందరికి ఇచ్చే అవకాశం ఉంది. అలా వారందరినీ సర్దుబాటు చేస్తారు చంద్రబాబు. ఒక విధంగా చెప్పాలంటే 2026 పదవుల జాతర అని చెప్పవచ్చు.

# పవర్ షేరింగ్ గేమ్ కు తెర...

బెంగళూరు,: కర్నాటక పవర్ షేరింగ్ గేమ్ కి తెరపడినట్లే కనిపిస్తోంది. సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మధ్య వివాదం ముగిసినట్లే అనిపిస్తోంది. ఐదేళ్ల పాలనలో రెండున్నరేళ్లు ముగుస్తుండగా కర్నాటక కాంగ్రెస్ చీఫ్ డీకే శివకుమార్ కి సీఎం సీటు అప్పగించాలనే డిమాండ్ తెరమీదకు వచ్చింది. ఇదే క్రమంలో అటు సిద్ధరామయ్య, ఇటు డీకే వర్గం ఢిల్లీ వెళ్లి అధిష్టానం పెద్దలతో భేటీ కావటం ఆసక్తిని రేకెత్తించింది. అయితే, ఇంతలోనే ఐదేళ్లు తానే సీఎంగా ఉంటానని సిద్ధరామయ్య ప్రకటించగా, ఆయనకు తామంతా సహకరిస్తామని డీకే శివకుమార్ తేల్చి చెప్పటంతో ఈ పొలిటికల్ డ్రామాకి తెరపడినట్లు కనిపిస్తోంది.ఇప్పటికే మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలతో భేటీ అయిన సిద్ధరామయ్య క్యాబినెట్ విస్తరణ కోసం అధిష్టానం నుంచి అనుమతి కోరారు. దీని ద్వారా మరో ఏడాదిన్నర పాటు తన సీఎం సీటు సేఫ్ అని భావిస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తి కావటంతో అధికార పంపిణీ జరగాల్సిందేనంటూ డీకే శివకుమార్ క్యాంప్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు ఢిల్లీకి వెళ్లారు. సీఎం పదవికి డీకే శివకుమార్ అన్ని విధాలుగా అర్హుడని చెబుతున్నారు. ఈ వ్యవహారం నడుస్తున్న క్రమంలోనే డీకే శివకుమార్ ఎక్స్ వేదికగా చేసిన ట్వీట్ మరింత హీట్ పెంచింది.ఎక్కడ కృషి ఉంటుందో అక్కడే ఫలితం ఉంటుంది అంటూ ఆయన ట్వీట్ చేశారు. డీకే ట్వీట్ వెనుకున్న మర్మం ఏంటో అని అంతా చర్చించుకున్నారు. ఇంతలో సిద్ధరామయ్య అధిష్టానం పెద్దల దగ్గర ఈ పంచాయితీ తేల్చుకోవటం, వెంటనే డీకే క్లారిటీ ఇవ్వటంతో ఈ వివాదం ఇప్పటికి ముగిసినట్లుగానే కనిపిస్తోంది. అయితే, డీకే వర్గం దీనికి ఒప్పుకుంటుందా? మళ్లీ అసంతృప్తి జ్వాలలు రగులుతాయా? అన్నది హాట్ టాపిక్ గా మారింది.కర్నాటకలో నాయకత్వ మార్పుపై పెద్ద ఎత్తున ఊహాగానాలు కొనసాగాయి. ఈ వ్యవహారం కాంగ్రెస్ శ్రేణుల్లో హీట్ పెంచింది. ఇందిరా గాంధీ జయంతి వేడుకల్లో మాట్లాడిన డీకే.. కర్ణాటక కాంగ్రెస్ చీఫ్ పదవిలో శాశ్వతంగా ఉండలేను అని అనడం చర్చకు దారితీసింది. దీంతో ఒక్కసారిగా పవర్ షేరింగ్ వ్యవహారం తెర మీదకు వచ్చింది. సిద్ధరామయ్య సీఎంగా రెండున్నరేళ్లు గడిచిపోయాయి, దీంతో ముఖ్యమంత్రి పగ్గాలు డీకేకి అప్పగించాలంటూ ఆయన వర్గం ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు.2023 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్.. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. సిద్ధరామయ్య సీఎం అయ్యారు. అయితే, రెండున్నరేళ్ల తర్వాత అధికార పంపిణీ ఉంటుందని నాడు ఒప్పందం చేసుకున్నట్లు సమచారం. దీంతో నాయకత్వ మార్పుపై కొన్ని నెలలుగా విస్తృతస్థాయిలో చర్చ జరుగుతోంది. ఇదే సమయంలో డీకే చేసిన వ్యాఖ్యలు హీట్ పెంచాయి. నాయకత్వ మార్పు గురించి కాంగ్రెస్ పెద్దలపై ఒత్తిడి తెచ్చేందుకు డీకే మద్దతుదారులు ఢిల్లీకి కూడా వెళ్లినట్లు తెలుస్తోంది. డీకేకు సీఎం పగ్గాలు అప్పజెప్పాలని వారు కోరారట. అయితే, పూర్తి ఐదేళ్లు తానే సీఎంగా కొనసాగుతానని ముందు నుంచి సిద్ధరామయ్య తెగేసి చెబుతున్నారు. చివరికి ఆయన అనుకున్నట్లే జరిగిందన్న అభిప్రాయం కాంగ్రెస్ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

# బిఆర్ఎస్ లో చేరిన మాజీ సర్పంచ్



జయశంకర్ భూపాలపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లి గోరి మండలం,జగ్గయ్యపేట గ్రామ మాజీ సర్పంచ్ అమ్ముల రాజయ్య వారితో పాటు బోయిని సదయ్య, అమ్ముల సంపత్, పెద్దబోయిన రవి, ఎండీ అజ్జి, బండి సాంబయ్య, నన్నవేన కొమురయ్య, బైకాని అయిలు కొమురు కాంగ్రెస్ పార్టీ వీడి భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి సమక్షంలో గురువారం బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికీ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ అమ్ముల రాజయ్య మాట్లాడుతూ...గండ్ర దంపతుల ఆదేశాల మేరకు బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేసి కొన్ని అనివార్య కారణాల వల్ల బిఆర్ఎస్ పార్టీ వీడి కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది.కాంగ్రెస్ పార్టీలో చేరిన నాటి నుండి వాళ్ళ విధివిధానాలు నచ్చక తిరిగి ఈ రోజు భూపాలపల్లి అభివృద్ధి కొరకు పాటు పడి, అడగకముందే కొత్తపల్లి గోరి మండలాన్ని తీసుకొచ్చి ఆపదలో మా వెంట ఉండే భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి గారి సమక్షంలో తిరిగి బిఆర్ఎస్ పార్టీలో చేరడం చాలా సంతోషంగా ఉంది. పార్టీ మారి మేము చేసిన పొరపాటు నుండి నేర్చిన పాఠంతో బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేసి సర్పంచ్ ఎన్నికల్లో, రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ విజయకేతనం ఎగురవేస్తామని అందుకు మా శక్తి మేరకు పనిచేస్తామని ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి గారికి,జిల్లా పార్టీ అధ్యక్షురాలు జ్యోతి గారికి హామీ ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు హమీద్, గ్రామ శాఖ అధ్యక్షులు రఘుశాల తిరుపతి, బోయిని తిరుపతి, లక్ష్మికాంతం, సదయ్య, ఎండీ అహ్మద్,నవీన్, లింగారావు, అశోక్,యాట అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో భూత్పూర్ కాంగ్రెస్ నేత రచ్చ

జడ్చర్ల : జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నేతల దౌర్జన్యం కలకలం రేపింది. భూత్పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి ఒక యాక్సిడెంట్ కేసులో రాజీ కుదరించేందుకు పోలీస్ స్టేషన్‌కి వచ్చి, కోరినట్టు రాజీ జరగకపోవడంతో ఆగ్రహంతో పోలీసులు మీదే దాడి యత్నానికి దిగారు. ఈ ఘటనపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కానిస్టేబుల్ గల్లా పట్టి కొట్టిన కాంగ్రెస్ నేత..: మంగళవారం, యాక్సిడెంట్ కేసు చర్చల మధ్య శ్రీనివాస్ రెడ్డి విధుల్లో ఉన్న కానిస్టేబుల్ భీమయ్యను గల్లా పట్టి కొట్టడంతో పాటు మరో కానిస్టేబుల్ లక్ష్మప్పను తోసేయడం చోటుచేసుకుంది. పోలీస్ స్టేషన్‌లోనే ఉన్న ఎస్సై జయప్రసాద్ వారించడానికి ప్రయత్నించినప్పుడు, అతనిపైనా దౌర్జన్యంగా మాట్లాడి, బెదిరింపులకు పాల్పడ్డారు."నీ జాబ్ ఎంత..? నీవెంత..? నిన్ను ఇక్కడి నుంచి ట్రాన్స్‌ఫర్ చేస్తా%ౌ% దమ్ముంటే బయటికి రా..!" అని ఎస్సైపై దాడి చేయడానికి 30 మందికి పైగా కాంగ్రెస్ కార్యకర్తలు ప్రయత్నించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఎస్సై స్వయంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడిని లాకప్‌లో పెట్టారు.

ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పోలీస్ స్టేషన్‌కు చేరిక..: సమాచారం తెలుసుకున్న దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ మధుసూదన్ రెడ్డి జడ్చర్ల పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఘటనపై వివరాలు తెలుసుకున్నారు.

# పిలిచి పదవి ఇస్తామన్నా వద్దంటున్నారా

విజయవాడ, : తెలుగుదేశం పార్టీలో సీనియర్ నేతగా ఉన్న దేవినేని ఉమామహేశ్వరరావును రాజ్యసభకు పంపడంపై పార్టీలో చర్చ జరుగుతుంది. మరో ఆరు నెలలో రాజ్యసభ స్థానాలు ఆంధ్రప్రదేశ్ లో ఖాళీ అవుతున్నాయి. ఖాళీ అవుతున్న రాజ్యసభ స్థానాలను దక్కించుకుంటే ఆరేళ్ల పాటు పదవికి ఢోకా ఉండదు. అనేక మంది సీనియర్ నేతలు రాజ్యసభ రేసులో ఉన్నారు. అయితే దేవినేని ఉమామహేశ్వరరావుకు పెద్ద వయసు మించిపోలేదు. ఆయనను రాజ్యసభ కు పంపే కంటే ఎమ్మెల్సీ ఇవ్వడం మంచిదన్న అభిప్రాయం కూడా ఆయన అనుచరుల నుంచి వ్యక్తమవుతుంది. కానీ పార్టీ అగ్రనాయకత్వం ఆలోచనలు ఎలా ఉన్నాయన్న దానిపై ఇంకా క్లారిటీ మాత్రం రాలేదు రాజ్యసభ స్థానానికి వెళ్లారంటే ఇక ప్రత్యక్ష రాజకీయాలతో పాటు రాష్ట్ర రాజకీయాలకు కూడా దూరమయినట్లే భావించాల్సి ఉంటుంది. ప్రజలతో నేరుగా సంబంధం లేని పోస్టు కావడంతో దానిపై దేవినేని ఉమ లాంటి వ్యక్తులు అంతగా ఆసక్తి చూపరు. దేవినేని ఉమామహేశ్వరరావు రాజకీయమంతా టీడీపీలోనే కొనసాగుతుంది. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1999 లో ఆయన నందిగామ నుంచి రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 2004లోనూ ఆయన నందిగామ నుంచి ఎన్నికయ్యారు. తర్వాత నందిగామ నియోజకవర్గం రిజర్వ్‌డ్ కావడంతో పార్టీ అధినాయకత్వం సూచన మేరకు మైలవరానికి షిఫ్ట్ అయ్యారు. 2009, 2014 ఎన్నికల్లో దేవినేని ఉమ మైలవరం నుంచి ఎన్నికయ్యారు. 2019 ఎన్నికల్లో మాత్రం తొలిసారి ఓటమి పాలయ్యారు దేవినేని ఉమ వ్యవహారంలో అధినాయకత్వం ఆలోచన ఎలా ఉందన్నది ఎవరికీ అర్థం కావడం లేదు. ఉమ ఇక్కడుంటే మళ్లీ కృష్ణా జిల్లా రాజకీయాల్లో గ్రూపు తగాదాలు ఎక్కువవుతాయన్న వాదనలను కూడా పార్టీ నాయకత్వం పరిగణనలోకి తీసుకునే అవకాశముంది. అదే సమయంలో దేవినేని ఉమను రాజ్యసభకు పంపాలంటే సామాజికవర్గం కూడా కొంత అడ్డంకి గా మారుతుంది. ఈ నేపథ్యంలో దేవినేని

ఉమకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చిఇక్కడే కొనసాగిస్తారా? లేక వచ్చే ఎన్నికల్లో నందిగామ జనరల్ నియోజకవర్గం అయితే అక్కడి నుంచి పోటీ చేయవచ్చని సర్ది చెబుతారా? అన్నది ఇంకా తేలలేదు. రాజ్యసభ పదవి మాత్రం తనకు వద్దంటే వద్దని మాత్రం దేవినేని ఉమ చెబుతున్నట్లు తెలిసింది. పదవి ఇస్తామని ఎవరూ చెప్పకపోయినా.. తనకు పిలిచి పదవి రాజ్యసభ ఇస్తామన్నావద్దని చెబుతానని దేవినేని సన్నిహితుల వద్ద వ్యాఖ్యానిస్తున్నారట.

# 9వ శతాబ్దపు శిల్ప వారసత్వం

## కాగజ్‌నగర్ ఇస్లాంలో శివ మల్లన్న పురాతన ఆలయం

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా: కాగజ్‌నగర్ మండలం ఇస్లాంలో ఉన్న శివ మల్లన్న స్వామి ఆలయం చారిత్రకంగా కీలకమైనది. 9వ శతాబ్దం నాటిదిగా గుర్తింపబడిన ఈ దేవాలయం, ఆ ప్రాంత అతి ప్రాచీన శివాలయాలలో ఒకటిగా భక్తుల విశ్వాసాన్ని వేలఏళుగా నిలబెట్టుకుంటోంది.పురోహితుల వివరాల ప్రకారం, జైనుల పాలన కాలంలో ఈ ప్రాంతం భైరవనామంచే అనే పేరుతో ప్రసిద్ధి చెందింది. ఆ సమయంలో జైన సంస్కృతి, శైవ సంప్రదాయాలు సమాంతరంగా కొనసాగినట్లు చరిత్ర చెబుతోంది.

అదే పరంపరలో భైరవ రూపం నుంచి “మల్లన్న” రూపానికి మారి స్థానిక భక్తుల వద్ద ప్రత్యేక పూజలు ప్రారంభయ్యాయి. మల్లన్న, శివుని కరుణామయ రూపంగా భావించే సంప్రదాయం ఈ ప్రాంతంలో శతాబ్దాలుగా కొనసాగుతోంది.

తరువాత కాలంలో, ఆలయం పునరుద్ధరణ అవసరం ఏర్పడడంతో కంచి కామకోటి పీఠాధిపతి సద్గురు శంకరాచార్యులు ఆదేశాలు ఇచ్చినట్లు ఆలయ పురోహితులు చెబుతున్నారు. ఆలయ నిర్మాణం పూర్తిగా ఆగమ శాస్త్ర విధానాల ప్రకారం, శిల్పాలు, గర్భగుడి నిర్మాణం, ధ్వజస్తంభ స్థానం, ప్రాకారాలుఅన్ని సాంప్రదాయ లేఅవుట్లు పునర్నిర్మించబడింది.1979లో జ్యేష్ఠ శుద్ధ పంచమి నాడు పంచరాత్ర ఆగమ ప్రకారం యజ్ఞాలు, హవనాలు, అగ్నికార్యాలు నిర్వహించి శివమూర్తికి ప్రాణ ప్రతిష్ఠ చేయడం జరిగింది. అప్పటి నుంచి ఈ ఆలయం పండుగలు, బ్రహ్మోత్సవాలు, ముఖ్యంగా మాహాశివరాత్రి వేళ వేలాది భక్తులతో సందడిగా మారుతుంది. స్థానికులు ఈ ఆలయాన్ని గ్రామ రక్షకదేవతగా భావించి తరతరాలుగా పూజలు కొనసాగిస్తున్నారు.

అంతేకాకుండా, ఈ ఆలయం కాగజ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో చారిత్రక పరిశోధకులకు, శిల్పకళాభిమానులకు, ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శించే వారికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. పురాతన శిల్పాలు, శైవ చిహ్నాలు, జైన ప్రభావం కనిపించే నిర్మాణ శైలి ఆలయాన్ని మరింత ప్రత్యేకంగా నిలిపాయి

# యూపీలో గుండెపోటు బాధితులకు ఉచితంగా రూ.50 వేల విలువైన ఇంజెక్షన్

- గుండెపోటు బాధితుల కోసం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం
- రూ. 50 వేల విలువైన ఇంజెక్షన్‌ను ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా పంపిణీ
- 'గోల్డెన్ అవర్'లో ప్రాణాలు కాపాడటమే ప్రభుత్వ లక్ష్యం
- మెడికల్ కాలేజీలు, జిల్లా ఆసుపత్రుల్లో ఈ సౌకర్యం అందుబాటులోకి



యూపీ : గుండెపోటు బాధితుల ప్రాణాలు కాపాడే దిశగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మార్కెట్‌లో రూ.40 వేల నుంచి రూ.50వేల వరకు ధర పలికే అత్యవసర ఇంజెక్షన్‌ను రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందించాలని నిర్ణయించింది. ఈ నిర్ణయంతో గుండెపోటు మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చని అధికారులు భావిస్తున్నారు. గుండెపోటు వచ్చిన మొదటి గంటను వైద్య పరిభాషలో 'గోల్డెన్ అవర్'గా పిలుస్తారు. ఈ కీలక సమయంలో రోగికి ఈ ఇంజెక్షన్ అందిస్తే, రక్తనాళాల్లో ఏర్పడిన గడ్డలను కరిగించి, రక్త ప్రసరణను సాధారణ స్థితికి తీసుకురావచ్చు. తద్వారా ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశాలు మెరుగవుతాయి. ఈ నేపథ్యంలో, గుండెపోటు లక్షణాలతో ఆసుపత్రిలోని అత్యవసర విభాగానికి వచ్చిన రోగికి తక్షణమే ఈ ఇంజెక్షన్ ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సౌకర్యం కొన్ని ప్రముఖ వైద్య సంస్థలలో 'హబ్-అండ్-స్పోక్' విధానంలో అమలవుతోంది. తాజా నిర్ణయంతో రాష్ట్రంలోని అన్ని మెడికల్ కాలేజీలు, జిల్లా ఆసుపత్రులు, ముఖ్యమైన సామాజిక ఆరోగ్య కేంద్రాల్లోనూ ఈ ఇంజెక్షన్ ఉచితంగా అందుబాటులోకి రానుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ చొరవతో ఎందరో పేద, మధ్యతరగతి రోగుల ప్రాణాలు నిలబడతాయని వైద్య నిపుణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# నామినేషన్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల: సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్ వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారికలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని లక్షెట్టిపేట మండలంలోని గుల్లకోట మిట్టపల్లి సూరారం గ్రామాలకు గుల్లకోట గ్రామపంచాయతీ పోతపల్లి అంకతిపల్లి లక్ష్మీపూర్ గ్రామాలకు పోతపల్లి గ్రామపంచాయతీ చందారం హనుమంతుపల్లి రంగపేట గ్రామాలకు చందారం గ్రామపంచాయతీలలో ఏర్పాటుచేసిన నామినేషన్ కేంద్రాలను సందర్శించి రిటర్నింగ్ సహాయ రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు చేపట్టిన నామినేషన్ స్వీకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో 3 విడతలలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా మొదటి విడతలో 90 సర్పంచ్, 816 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ స్వీకరణ కేంద్రం ముందు గ్రామపంచాయతీలోని వార్డుల వారీగా ఫోటో ఓటర్ల జాబితా రిజర్వేషన్ల వివరాలను ప్రదర్శించాలని నామినేషన్ కేంద్రం నుండి 100 మీటర్ల పరిధిలో గుంపులుగా ఎవరిని అనుమతించకూడదని నామినేషన్ సమర్పించే అభ్యర్థులు



ప్రతిపాదించే వారిని మాత్రమే అనుమతించాలని తెలిపారు. నామినేషన్ల స్వీకరణలో ఎన్నికల కమిషన్ జారీ చేసిన నియమాలకు లోబడి వ్యవహరించాలనీ నామినేషన్ పత్రాల స్వీకరణ నామినేషన్ల పరిశీలన అభ్యర్థుల ప్రకటన గుర్తుల కేటాయింపు ప్రక్రియలో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. అనంతరం ఇటిక్యాల గ్రామంలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. మండల కేంద్రంలోని 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేపట్టిన పోస్ట్ మార్టం గది నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులు సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సరోజ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శివజ్యోతికి బిగ్ షాక్ ఇచ్చిన టీటీడీ..


# ఆమె ఆధార్ కార్డ్ బ్లాక్ చేశారా?





యాంకర్ శివ జ్యోతి గురించి బుల్లితెర ప్రేక్షకులకి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. తీన్మార్ కార్యక్రమంతో బాగా ఫేమస్ అయిన శివజ్యోతి ఆ తర్వాత బిగ్ బాస్ షోలో పాల్గొని అశేష ప్రేక్షకాదరణ పొందింది.ప్రస్తుతం అడపాదడపా టీవీ షోలలో పాల్గొంటూ సోషల్ మీడియాలోను తెగసందడి చేస్తుంటుంది.అయితే రీసెంట్‌గా శివజ్యోతి తిరుమల శ్రీవారి దర్శనం కోసం క్యూ లైన్‌లో నిల్చునే వారికి ఇచ్చే అన్నప్రసాదంపై సంచలన కామెంట్స్ చేసింది. ఆమె చేసిన కామెంట్లు విమర్శలపాలైన విషయం తెలిసిందే. భర్త, స్నేహితులతో కలిసి తిరుమలకు వెళ్లిన సమయంలో చేసిన "రిచ్చెస్ట్ బిచ్చగాళ్లం" వ్యాఖ్య భక్తుల కోపాన్ని రగిలించింది. ఈ ఘటనపై విమర్శలు పెరగడంతో శివ జ్యోతి వెంటనే క్షమాపణలు చెప్పింది. అయిన వివాదం పూర్తిగా చల్లారలేదు.ఇదిలా ఉండగా, ఇప్పుడు శివ జ్యోతి గురించి మరో వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆమె ఆధార్ కార్డును టీటీడీ అధికారులు బ్లాక్ చేశారని, దీంతో భవిష్యత్తులో తిరుమల శ్రీవారి దర్శనం పొందే అవకాశమే లేకుండా పోయిందని ప్రచారం జరుగుతోంది. ప్రసాదాన్ని అవమానించినందుకే ఈ చర్య తీసుకున్నారని అంటున్న హిందూ సంఘాలు టీటీడీ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాయి. గతంలో ఆమె పోస్ట్ చేసిన బాత్‌రూమ్ వీడియో కూడా వివాదాలకు తావిచ్చిన విషయం తెలిసిందే. "తీన్మార్" కార్యక్రమంలో "సావిత్రక్క"గా పాపులర్ అయిన శివ జ్యోతి జర్నలిస్టుగా కెరీర్ ప్రారంభించి, తన ప్రత్యేకమైన తెలంగాణ యాసతో మంచి గుర్తింపు సంపాదించారు. బిగ్ బాస్ సీజన్ 3లో 98 రోజులు ఉండి ప్రేక్షకుల మన్ననలు పొందిన ఆమె, ఆ తర్వాత పలు టీవీ షోలు, ఈవెంట్లలో యాంకరింగ్ చేస్తూ మంచి అభిమానాన్ని సంపాదించారు. 'జ్యోతక్క' పేరుతో యూట్యూబ్ ఛానెల్ నిర్వహిస్తూ, భర్తతో కలిసి సోషల్ మీడియాలో కూడా చురుకుగా ఉంటున్నారు.

# లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో పవన్ కల్యాణ్..?



స్టయిలిష్ యాక్షన్, గ్యాంగ్‌స్టర్ డ్రామాలతో దక్షిణాదిలో తనదైన ముద్రను వేశారు దర్శకుడు లోకేష్ కనకరాజ్. ఖైదీ, విక్రమ్, కూలీ వంటి చిత్రాలు ఆయన ప్రతిభకు అద్దం పట్టాయి. రజనీకాంత్‌తో 'కూలీ' తర్వాత ఆయన తమిళంలో రజనీ-కమల్‌హాసన్ మల్టీస్టారర్‌కు దర్శకత్వం వహిస్తారనే వార్తలు వినిపించాయి. అయితే ఇప్పుడీ ప్రాజెక్ట్ నుంచి తప్పుకొని తెలుగు స్ట్రెయిట్ చిత్రంపై దృష్టి పెడుతున్నారట లోకేష్ కనకరాజ్. పవన్‌కల్యాణ్‌తో ఆయన ఓ సినిమా చేయబోతున్నారని, దానికి ఇప్పటికే రంగం సిద్ధమైందని ఫిల్మ్‌నగర్ టాక్. కన్నడంలో పేరొందిన అగ్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని తెరకెక్కించనుందట. ఈ సినిమాలో నటించేందుకు పవన్‌కల్యాణ్ సుముఖంగా ఉన్నారని, త్వరలో అధికారిక ప్రకటన వెలువడే అవకాశముందని అంటున్నారు.

అయితే ఈ వార్తలో నిజమెంతో తెలియాలంటే నిర్మాణ సంస్థ నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. పవన్‌కల్యాణ్ 'ఉస్తాద్ భగత్‌సింగ్' చిత్రం ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా తర్వాత పవన్‌కల్యాణ్ మరే ప్రాజెక్ట్‌కు అంగీకరించలేదు. ఈ నేపథ్యంలో ఆయన తదుపరి చిత్రం లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో ఉంటుందనే వార్తలు బలంగా వినిపిస్తున్నాయి.

# ఫారెస్ట్ అధికారుల బరితెగింపు....!

మణుగూరు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గం మణుగూరు ఫారెస్ట్ రేంజ్ అధికారులు రోజురోజుకు కొత్త సంస్కృతులకు తెరలేపుతున్నారు. అడ్డగోలుగా ఎలా సంపాదించాలి అనే విషయంపై కంకణం కట్టుకున్నారు. ఇటీవల ఇసుక ర్యాంపుల లారీలు వెళ్లేందుకు అడవి మార్గం గుండా సుమారు ఏడు కిలోమీటర్ల మేర ఇసుక కాంట్రాక్టర్లు అడవిని నరికేసి మరి రోడ్డు నిర్మించిన కలెక్టర్ ఆదేశాలంటూ చేతులు ముడుచుకుని కూర్చున్నారు. ఇప్పుడు తాజాగా వీరికన్ను సింగరేణి బొగ్గు లారీల పై పడింది. మణుగూరులో ఫారెస్ట్ అధికారులు కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. లారీలకు బొగ్గు ఇచ్చే అనుమతి పత్రాల్లో ఫారెస్ట్ పర్మిట్ ఫీజు పేరుతో నగదు వసూలు చేస్తున్నారు. ఇది చాలదన్నట్టు తాజాగా గురువారం మణుగూరు జీఎం కార్యాలయం వద్ద ఫారెస్ట్ అధికారులు ఒక్కో ఒగ్గులారీ వద్ద నుంచి 200 రూపాయలు దౌర్జన్యంగా వసూలు చేస్తున్నారు. నీతో ఆగ్రహించిన లారీ ఓనర్లు మణుగూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న మణుగూరు సీఐ నాగబాబు ఫారెస్ట్ అధికారులను పూర్తి వివరాలు అడిగారు. నవోదయ ఇలాంటి ఆదేశ పత్రాలు లేకపోవడంతో ఫారెస్ట్ అధికారులు లారీలను వదిలేసి అక్కడ నుంచి వెళ్లిపోయారు.

ఆయన చెప్పాడు ఈయన చెప్పాడు అంటూ బుకాయింపు.: బొగ్గు లారీల వద్ద 200 రూపాయల వసూలు చేయమని మాకు ఎఫ్ డి ఓ చెప్పాడంటూ ఫారెస్ట్ అధికారులు చెబుతూ డబ్బులను వసూలు చేస్తున్నారు. ఆయన చెప్పాడు ఈయన చెప్పాడు అంటూ వసూళ్లకు పాల్పడుతున్నారు. మణుగూరు సీఐ నాగబాబు స్థానిక ఎఫ్ డి వో సయ్యద్ మక్సూద్ కి ఫోన్ చేయగా నేను ఏం చెప్పలేదు. అసలు ఆ విషయం గురించి నాకు తెలియదు అంటూ చెప్పడంతో ఒకసారిగా ఫారెస్ట్ అధికారులు కంగుతిన్నారు. వారి బండారం బయటపడడంతో లారీలను వదిలేసి అక్కడ నుంచి వెళ్ళిపోయారు. వసూళ్ల పర్వం గురించి నాకు తెలియదు : డిస్టిక్ ఫారెస్ట్ ఆఫీసర్ కిష్టా గౌడ్. మణుగూరులో సింగరేణి బొగ్గు లారీల వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్న విషయం నాకు తెలియదు. ఈ విషయం ఇప్పటివరకు నా దృష్టికి రాలేదు. వస్తే చర్యలు తీసుకుంటా. అనిశా అధికారులు జర దేకో...: మణుగూరు మండలంలో ఫారెస్ట్ అధికారులు డబ్బుల వసూళ్ల పర్వానికి శ్రీకారం చుట్టారు. ఇసుక ర్యాంపులకు అటవీ ప్రాంతం నుండి రోడ్లు వేసినందుకు ఫారెస్టు అధికారులకు పెద్ద మొత్తంలోనే ముడుపుల అందాయని ఆరోపణలు గట్టిగానే వినిపిస్తున్నాయి. అంతేకాకుండా కొత్తగా బొగ్గు లారీల వద్ద నుంచి డబ్బులను వసూలు చేస్తున్నారు. దీంతో మండలంలోని ప్రజలు మండిపడుతున్నారు. అనిశా అధికారులు ఫారెస్ట్ డిపార్ట్మెంట్ పై ఒక కన్నేసి ఉంచాలని కోరుతున్నారు.

# సినిమా..

## 80వ రోజు ఎపిసోడ్ హౌస్‌లో సందడి



బిగ్ బాస్ తెలుగు సీజన్ 9లో 80వ రోజు కి సంబంధించిన ఎపిసోడ్ పూర్తి ఎంటర్‌టైన్‌మెంట్‌తో సాగింది. ఈసారి హౌస్‌లోకి ప్రత్యేకంగా మాజీ కంటెస్టెంట్లైన ప్రేరణ, దేత్తడి హారిక, మానస్ లాంటి వారు ప్రవేశించి కంటెస్టెంట్లతో పోటీ పడటంతో హౌస్‌లో టెన్షన్ వాతావరణం నెలకొంది.

వీరితో జరిగిన టాస్కలలో విజయం సాధించిన హౌస్‌మేట్స్‌కు కెప్టెన్సీ కంటెండర్ అవకాశాలు లభించాయి. వారిలో ఎవరు గెలిచినా హౌస్ యొక్క చివరి కెప్టెన్ అయ్యే అవకాశం ఉంటుంది. మొదట ప్రేరణ హౌస్‌లోకి ఎంట్రీ ఇచ్చి కంటెస్టెంట్లతో సరదాగా మాట్లాడింది. తనతో పోటీ పడే వ్యక్తిని ఎంపిక చేయడానికి ప్రేరణ సిద్ధమయ్యాక, అందరూ ఆమెతో టాస్క్ చేసే ఛాన్స్ ఇవ్వాలని కోరుకున్నారు. తనూజ చాకచక్యంగా ప్రేరణను పొగుడుతూ తనకే అవకాశం ఇవ్వాలని కోరగా, ప్రేరణ ఆమెను ఎంచుకుంది. అయితే టేబుల్‌లోని హెూల్స్‌లో బాల్స్ వేయాల్సిన ఈ పోటీలో తనూజ తేలిపోయి, ప్రేరణ విజయం సాధించింది. దీంతో తనూజ కెప్టెన్సీ అవకాశాన్ని కోల్పోయింది. ఈలోపు హౌస్‌లో భరణి- దివ్య మధ్య మళ్లీ వాగ్వాదం చెలరేగింది. భరణి ఇకపై తక్కువ మాట్లాడటానికి ప్రయత్నిస్తానని చెప్పగా, దివ్య కూడా కౌంటర్ ఇచ్చింది. వాదన వేడెక్కిన తర్వాత భరణి "నీకు నమస్కారం" అని అన్న విషయం దివ్యకు అభ్యంతరం కలిగించింది. అలాంటి మాటలు మాట్లాడవద్దు అని దివ్య కూడా ఫైర్ అయింది. ప్రతిసారీ హౌస్‌లో నా ఏజ్ గురించి ఎందుకు ప్రస్తావిస్తున్నావ్ అని భరణి అడిగారు. మీరంతా నాపై జోకులు వేస్తే నేను భరించాలి.. నేను జోకు వేస్తే మాత్రం గొడవ పెట్టుకుంటారు అని దివ్య బాధపడింది. తర్వాత హౌస్‌లోకి దేత్తడి హారిక ప్రవేశించి, తన ప్రత్యర్థిగా సుమన్ శెట్టిని ఎంచుకుంది. టవర్ నిర్మించే టాస్క్‌లో హారికనే విజేతగా నిలిచింది. అనంతరం బిగ్ బాస్ 5 టాప్ 5 కంటెస్టెంట్ మానస్ ఎంట్రీ ఇచ్చి, తనతో పోటీకిడీమాన్ పవన్‌ను ఎంపిక చేసుకున్నాడు. బంతులను మేకులకు గుచ్చే ఈ టాస్క్‌లో పవన్ అద్భుతంగా ఆడి మానస్‌ను ఓడించి కెప్టెన్సీ కంటెండర్‌గా స్థానం సంపాదించాడు.మొత్తంగా, పాత కంటెస్టెంట్ల రాకతో బిగ్ బాస్ హౌస్‌లో పోటీ ఉత్కంఠత పెరిగి, చివరి కెప్టెన్సీ రేసు మరింత రసవత్తరంగా మారింది.

## పని గంటల వివాదంపై కీర్తి సురేశ్.. తెలివైన సమాధానం



సినీ పరిశ్రమలో కొన్ని నెలలుగా చర్చనీయాంశమైన '8 గంటల పని' వివాదంపై ప్రముఖ నటి కీర్తి సురేశ్ స్పందించారు. తన కొత్త చిత్రం 'రివాల్వర్ రీటా' ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె ఈ విషయంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బాలీవుడ్ నటి దీపిక పదుకొణె ప్రారంభించిన ఈ చర్చపై కీర్తి తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. పనివేళల గురించి మాట్లాడుతూ.. "నేను 9 నుంచి 6 గంటలైనా, 9 నుంచి 9 గంటలైనా పనిచేయగలను. అదొక సమస్య కాదు. కానీ ఉదయం 9 గంటలకు సెట్‌లో ఉండాలంటే, నటీనటులు తెల్లవారుజామున 5 గంటలకే లేవాలి. మేకప్ పూర్తి చేసుకుని 7:30 కల్లా లొకేషన్‌కు చేరుకోవాలి" అని వివరించారు. షూటింగ్ పూర్తయ్యాక ఇంటికి చేరేసరికి చాలా ఆలస్యమవుతుందని, దీంతో విశ్రాంతికి సమయం సరిపోదని అన్నారు. "మనిషికి నిద్ర చాలా ముఖ్యం. కానీ మాకు 8 గంటల నిద్ర ఎక్కడుంది?" అని ఆమె ప్రశ్నించారు. అయితే, అవసరమైతే తాను ఎన్ని గంటల పాటైనా నటిస్తానని చెబుతూనే, నటీనటుల కంటే టెక్నీషియన్ల పరిస్థితి మరింత కష్టంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. "మా కంటే వాళ్లు ఎక్కువ సమయం సెట్‌లో ఉంటారు, వారికి కేవలం రెండు, మూడు గంటల నిద్రే దొరుకుతుంది" అని అన్నారు. తెలుగు, తమిళ పరిశ్రమల్లో 8 గంటల పని విధానం ఉందని, కానీ మలయాళం, హిందీ పరిశ్రమల్లో 12 గంటల కాల్షీట్ ఉంటుందని పేర్కొన్నారు.

మొత్తంమీద, కీర్తి సురేశ్ ఒకవైపు దీపిక వాదనలోని నిద్ర ప్రాముఖ్యతను సమర్థిస్తూనే, మరోవైపు నిర్మాతలకు ఇబ్బంది కలగకుండా తాను ఎక్కువ గంటలు పనిచేయడానికి సిద్ధమని చెప్పి తెలివిగా వ్యవహరించారని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

# దేవుడు వరం ఇస్తే.. అదే కోరుకుంటా



నటి, నిర్మాత మంచు లక్ష్మి తన కుటుంబంలో చోటుచేసుకున్న వివాదాలపై తొలిసారి బహిరంగంగా స్పందించారు. తన కుటుంబం మళ్లీ మునుపటిలా సంతోషంగా కలిసిపోవాలని ఆకాంక్షిస్తూ భావోద్వేగానికి గురయ్యారు. తాజాగా ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె, పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. "ఒకవేళ దేవుడు ప్రత్యక్షమై వరం కోరుకోమంటే, నా కుటుంబం అంతా మళ్లీ సంతోషంగా కలిసి ఉండాలని కోరుకుంటాను. ప్రతీ కుటుంబంలో గొడవలు సహజం. కానీ ఎన్ని అడ్డంకులు వచ్చినా చివరికి అందరూ ఒక్కటిగా ఉండాలి. మన భారతీయ కుటుంబాల్లో గొడవలు వస్తే మళ్లీ కలవకూడదనే మొండి పట్టుదలతో ఉంటారు. కానీ, కష్టకాలంలో మనకు అండగా నిలిచేది రక్తసంబంధీకులే. వారితో కలిసి ఉండటానికి ఎంతటి పోరాటమైనా చేయాలి కానీ, దూరం పెంచుకోకూడదు" అన్నారు లక్ష్మి.తాను ముంబైలో నివసించడం వల్ల కుటుంబంలో జరిగిన గొడవల గురించి పెద్దగా బాధపడలేదని కొన్ని ప్రచారాలు జరిగాయని, కానీ ఆ సమయంలో తాను ఎంత మానసిక వేదన అనుభవించానో తనకే తెలుసని ఆమె స్పష్టం చేశారు. తన బాధను అందరికీ ప్రదర్శించాల్సిన అవసరం లేదనే ఉద్దేశంతోనే మౌనంగా ఉన్నట్లు వివరించారు. సాధారణంగా సినిమా ప్రమోషన్ల సమయంలో తప్ప, వ్యక్తిగత ఇంటర్వ్యూలు ఇవ్వడానికి తాను ఇష్టపడనని తెలిపారు. కుటుంబంలో ఎన్నో బాధ్యతలు నిర్వర్తిస్తున్నానని, ముఖ్యంగా ఓ తల్లిగా తనకు తాను 10కి 10 మార్కులు వేసుకుంటానని మంచు లక్ష్మి పేర్కొన్నారు.

Published & Owned by Mamidi Somaiah, H.No.3- 2-92/27 to 276/506, Rock Town Colony, LB Nagar, Hyd, Rangareddy, Telangana- 500068. Printed at Ellora Printers, LN Nagar, Industrial Estate, Uppal, Rangareddy, Telangana. Editor- Mamidi Somaiah. Ph No. 9 00933723. RNI No. TEL TEL . 12/48343